నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 24-7-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 287 పేజీలు:6 వెల: రూ.1/-

నేడు, రేపు హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, జులై 23: హైదరాబాద్ వ్యాప్తంగా ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. సోమవారం ఫలహార బండ్లను ఊరేగించనున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. ఇక్బాల్ మీనార్ నుంచి కట్టమైసమ్మ టెంపుల్ వైపు వచ్చే వాహనాలను అనుమతించబోమని పేర్కొన్నారు.తెలుగు తల్లి ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లే వాహనాలను తెలుగు తల్లి జంక్షన్ మీదుగా మళ్లించనున్నారు. ఇక కవాడిగూడ నుంచి డీబీఆర్ మిల్స్ మీదుగా వచ్చే వాహనాలను.. ఎమ్మార్వో ఆఫీసు వద్ద వార్త లేన్, ఇందిరా పార్క్ మీదుగా అశోక్ నగర్ వైపు మళ్లించనున్నారు.అంబేద్కర్ విగ్రహం నుంచి ఇందిరా పార్క్ వచ్చే వాహనాలను.. దోమల్‌గూడ మీదుగా ఇందిరా పార్క్ జంక్షన్ నుంచి అశోక్ నగర్ క్రాస్ రోడ్స్ వైపు మళ్లించనున్నారు.ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి కట్టమైసమ్మ ఆలయం వైపు వచ్చే వాహనాలను.. దోమల్‌గూడలోని స్ట్రీట్ నంబర్ 5 మీదుగా రిలయన్స్ అపార్ట్‌మెంట్(రమ్య హోటల్), లిబర్టీ వైపు మళ్లించనున్నారు.

అరుణాచల్ ప్రదేశ్ ఘటనలో- గల్లంతయిన వారిలో ఏడుగురి అచూకీ లభ్యం

న్యూఢిల్లీ, జులై 23: ఏడుగురు కూలీలను రక్షించారు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వారు. వారికి వైద్య సహాయం అందించామని కురుంగ్ కుమే జిల్లా డీఎం నిఖి బెంగియా తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కురుంగ్ కుమే జిల్లాలో జూలై 13వ తేదీన 19 మంది రోడ్డు నిర్మాణ కార్మికులు గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన వారిలో ఏడుగురి ఆచూకీని పోలీసులు గుర్తించారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. వైద్య సహాయం, ఇతర అవసరాల కోసం కూలీలను ఒకే చోట ఉంచామన్నారు. జిల్లా యంత్రాంగం కూడా అవసరమైన సహాయం అందిస్తోందని తెలిపారు. వారికి సహాయం చేయడానికి వైద్య బృందాలను పంపామనీ, తప్పిపోయిన కార్మికుల కోసం ఎంఈ హెలికాప్టర్లు కూడా అన్వేషణ మరియు రెస్క్యూ ఆపరేషన్లలో నిమగ్నమై ఉన్నాయని తెలిపారు. గల్లంతైన 19 మంది కార్మికులను అస్సాం నుండి ఃఖీ కాంట్రాక్టర్ బెంగియా బడో యొక్క సబ్-కాంట్రాక్టర్లు తీసుకువచ్చారని, ఈ మేరకు జూలై 13 న కొలోరియాంగ్ పోలీస్ స్టేషన్‌లో 19 మంది కార్మికుల తప్పిపోయిన ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆఖీఈతో సహా స్థానిక పరిపాలన సిబ్బంది రెస్క్యూ పనిలో నిమగ్నమైంది.

27న హైదరాబాద్‌లో జాబ్ మేళా

హైదరాబాద్, జులై 23: ప్రయివేటు రంగంలో ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారా..? ఐటీ కంపెనీల్లో ఉద్యోగం చేయాలనుకుంటున్నారా..? మెడికల్ రంగంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే ఆలస్యం ఎందుకు.. ఈ నెల 27న హైదరాబాద్ నాంపల్లిలో నిర్వహించే జాబ్ మేళాకు హాజరవ్వండి. ఉద్యోగం పొందండి.

ఈ నెల 27వ తేదీన నాంపల్లిలోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్‌లో దక్కన్ బ్లాస్టర్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 70 కంపెనీలు పాల్గొననున్నాయి. ఐటీ కంపెనీలు, బ్యాంకులు, అకాడమిక్స్, హోటల్ మేనేజ్‌మెంట్, మెడికల్‌తో పాటు ఇతర సెక్టార్లలో ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న నిరుద్యోగులు.. జాబ్ మేళాకు అటెండ్ అవొచ్చు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8374315052 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. లేదా నేరుగా జాబ్ మేళాకు మీ రెజ్యూమ్‌తో హాజరు అవొచ్చు.

మంత్రి కేటీఆర్ కాలికి గాయం.. 3 వారాలు రెస్ట్, ఇంటికే పరిమితం!

హైదరాబాద్, జులై 23: టీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, డైనమిక్ లీడర్, మంత్రి కేటీఆర్ రేపు బర్త్‌డే జరుపుకోనున్నారు. అయితే అనుకోని విధంగా ఆయన కాలుజారీ కిందపడడంతో పాదం (ఆంకిల్ లిగిమెంట్) బెనికింది. దీంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. కాగా, మూడు వారాలు రెస్ట్ తీసుకోవాలని డాక్టర్లు చెప్పడంతో ఇంట్లోనే ఉండిపోయారు. ఈ మేరకు ఆయన ఈ వివరాలను తన ట్విట్టర్ ద్వారా తెలియజేశారు.

ఇక తనకు ఈ మూడు వారాలు ఓటీటీలో ఉన్న కంటెంట్ లో ఏది చూడాలో తెలియజేయాలని అభిమానులను కోరారు. అదే తనకు ఇప్పుడు కాస్త రిలీఫ్ ఉంటుందని తెలియజేశారు. కాగా, బర్త్ డే ముందు రోజు కాలి గాయంతో కేటీఆర్ ఇంటికే పరిమితం కావడంపై అభిమానులు, కార్యకర్తలు కాస్త నిరుత్సాహంగా ఉన్నారు.

కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా, వరద బాధితులకు కోటి రూపాయల సరుకులు ఇవ్వనున్న పొంగులేటి

హైదరాబాద్, జులై 23: తన పుట్టిన రోజు సందర్భంగా ఎవరూ హంగామా చేయొద్దని, హడావిడి కార్యక్రమాలతో డబ్బు ఖర్చుపెట్టొద్దని మంత్రి కేటీఆర్? తెలిపారు. అంతేకాకుండా వరదలతో ఇబ్బంది పడుతున్న వారికి, ఇతర అత్యవసర పరిస్థితులున్న వారికి 'గిఫ్ట్? ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా ఆదుకోవాలని కోరారు. ఈ పిలుపుతో ముందుకు వచ్చారు ఖమ్మం టీఆర్ఎస్ లీడర్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. ఈ మధ్య గోదావరి వరదలతో నష్టపోయిన దాదాపు 15వేల మంది కుటుంబాలకు సాయం చేయాలని డిసైడ్? అయ్యారు.

ఖమ్మం మాజీ ఎంపీ, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రేపు మధ్యాహ్నం 2 గంటల నుంచి బూర్గంపాడు, భద్రాచలం మండలాల్లో గిఫ్ట్ ఏ స్మైల్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా సుమారు కోటి రూపాయల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో టీ ఆర్ ఎస్ పార్టీ ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలను ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్ తుళ్లూరి బ్రహ్మయ్య కోరారు.

భారీ వర్షాలు.. ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేసిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, జులై 23: రాష్ట్ర వ్యాప్తంగా మరో 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులను సీఎం కేసీఆర్ అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

గోదావరి నది తన జన్మస్థలమైన మహారాష్ట్రలోని త్రయంబకేశ్వరం నుంచి బంగాళాఖాతం వరకు పొంగిపొర్లుతున్నదని సీఎం కేసీఆర్ తెలిపారు. దీనికి తోడు గోదావరి ఉప నదులు కూడా నిండి ప్రవహిస్తున్నాయని చెప్పారు. వర్షపు నీరు వాగులు, వంకలు, కుంటలు, చెరువులకు చేరుతోందన్నారు. ఈ నేపథ్యంలో నదులు, ఉపనదులు కూడా ఉప్పొంగుతున్నాయని పేర్కొన్నారు.

గోదావరి ఉధృతంగా ప్రవహించే అవకాశం..

మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. మొన్నటి వరదల కంటే ఎక్కువగా వరదలు సంభవించే ప్రమాదం ఉందని సీఎం హెచ్చరించారు. ఇప్పుడు కురిసే వానలతో ఎల్లుండి వరకు గోదావరి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందన్నారు. ప్రమాద హెచ్చరికలను దాటి నది ప్రవహించే అవకాశం ఉన్నందున, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కేసీఆర్ హెచ్చరించారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ మొన్నటి మాదిరిగానే వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.

అధికార యంత్రాంగానికి పరీక్షా సమయం..

భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్న నేపథ్యంలో.. ఇది అధికార యంత్రాంగానికి పరీక్షా సమయం లాంటిందని కేసీఆర్ పేర్కొన్నారు. కష్టకాలంలో ప్రజలను కాపాడుకునేందుకు సంబంధిత అన్నిశాఖల అధికారులు వారి ఉద్యోగ కేంద్రాలను వదిలి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదని ఆదేశించారు. ఈ మేరకు తక్షణమే సర్క్యులర్ జారీ చేయాలని సీఎస్ సోమేశ్ కుమార్‌ను సీఎం ఆదేశించారు. వైద్యశాఖ, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్ అండ్ బీ, మున్సిపల్, మిషన్ భగీరథ తదితర శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు యంత్రాంగాన్ని కిందిస్థాయి పోలీస్ స్టేషన్ల వరకు ఎస్ఐ, సీఐలతోపాటు, పోలీసు సిబ్బంది హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్లకుండా ఆదేశాలు జారీ చేయాలని డీజీపీని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు.

వరదలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఈ సందర్భంగా నీటిపారుదలశాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గోదావరి ప్రవాహాన్ని, శ్రీరాంసాగర్ నుంచి కడెం వరకు ప్రాజెక్టుల పరిస్థితులను, వరదలు ఎట్లా వస్తున్నాయనే విషయాలను సీఎం కేసీఆర్‌కు వివరించారు. భారీ వర్షాలతో గోదావరి నదీ ప్రవాహం, ఎస్సారెస్పీ, కడెం నుంచి వస్తున్న వరదను, గంట గంటకూ మారుతున్న వరద పరిస్థితిని శాటిలైట్ ఆధారంగా రికార్డు చేసే విధానాన్ని ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ కుమార్ సీఎంకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

వాతావరణ హెచ్చరికలను ఆధారం చేసుకొని, కురవబోయే భారీ వర్షాల వల్ల సంభవించే వరదను ముందుగానే అంచనా వేస్తే.. లోతట్టు ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు చర్యల కోసం ఈ టెక్నాలజీని వినియోగించుకోవచ్చని రజత్ కుమార్ వివరించారు. వాతావరణ శాఖ వానలను అంచనా వేస్తున్నదని, కానీ తద్వారా వచ్చే వరద ముప్పును పసిగట్టలేక పోతున్నదని, ఈ టెక్నాలజీతో వరద ముప్పును కూడా అంచనా వేయవచ్చని రజత్ కుమార్ తెలిపారు.

హైదరాబాద్‌లో వర్షాలపై ఆరా..

హైదరాబాద్ నగరంలోని వర్షాలు, వరదలు, చెరువుల పరిస్థితిపై మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, జలమండలి ఎండీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్ తదితరులను అడిగి సీఎం వివరాలు తెలుసుకున్నారు.

తెలంగాణలో కొత్తగా 13 మండలాలు..

హైదరాబాద్, జులై 23: తెలంగాణలో కొత్తగా 13 మండలాలు ఏర్పాటు అయ్యాయి. ప్రజల ఆకాంక్ష, స్థానిక ప్రజా అవసరాలను పరిశీలించి, పరిపాలనా సంస్కరణల్లో భాగంగా మరికొన్ని మండలాలను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పలు జిల్లాల్లో కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

గట్టుప్పల్(నల్లగొండ), 2. కౌకుంట(మహబూబ్‌నగర్), 3. ఆలూర్(నిజామాబాద్), 4. సాలూర(నిజామాబాద్), 5. డొంకేశ్వర్(నిజామాబాద్), 6. సీరోల్(మహబూబాబాద్), 7. నిజాంపేట్(సంగారెడ్డి), 8. దోంగ్లీ(కామారెడ్డి), 9. ఎండపల్లి(జగిత్యాల), భీమారం(జగిత్యాల), 11. గుండుమల్(నారాయణపేట్), 12. కొత్తపల్లె(నారాయణపేట్), 13. దుద్యాల్(వికారాబాద్).

మీడియా కంగారు కోర్టులను నడుపుతోంది-జస్టిస్ ఎన్వీరమణ

హైదరాబాద్, జులై 23: మీడియా కంగారు కోర్టు లను నడుపుతోందని దీని వల్ల అనుభవజ్ఞులైన న్యాయమూర్తులు కూడా తీర్పులివ్వడంలో సతమతపడుతున్నారని మండిపడ్డారు. శనివారం జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. అనేక న్యాయపరమైన సమస్యలపై తప్పుడు సమాచారం, ఎజెండా అమలు చేయడం ప్రజాస్వామ్యానికి హానికరమని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ కంటే ప్రింట్ మీడియా జవాబుదారీగా ఉందని అభివర్ణించిన ఆయన.. మనం మన బాధ్యతల నుంచి పారిపోలేమని అన్నారు. ఇలాంటి ధోరణి మమ్మల్ని వెనుకకు నెట్టివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.న్యాయమూర్తులకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ఏకీకృత ప్రచారాలు జరుగుతున్నాయనీ, న్యాయమూర్తులు వెంటనే స్పందించకపోవచ్చు.

దయచేసి దీనిని బలహీనత లేదా నిస్సహాయత అని తప్పుపట్టవద్దని జస్టిస్ రమణ అన్నారు. కొత్త మీడియా సాధనాలు అపారమైన యాంప్లిఫైయింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయనీ, అయితే .. వాస్త, ఆవాస్తవలు, మంచి- చెడుల మధ్య తేడాను గుర్తించటం లేదని ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మధ్యకాలంలో న్యాయమూర్తులపై భౌతిక దాడులు పెరుగుతున్నాయని, భద్రత లేదా భద్రతకు ఎటువంటి హామీ లేకుండా, న్యాయమూర్తులు ప్రజలను దోషులుగా నిర్ధారించిన సమాజంలో జీవించాలని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య జీవితంలో న్యాయమూర్తి స్థానం ప్రత్యేకమైందన్నారు. న్యాయమూర్తులు సమాజం యొక్క వాస్తవికత, చట్టం మధ్య అంతరాన్ని తొలగిస్తారనీ, రాజ్యాంగ విలువలను రక్షిస్తాడని తెలిపారు.

ప్రపంచంలోని ఐటీ సంస్థలకు గమ్యస్థానం హైదరాబాద్ : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జులై 23: సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మకమైన విధానాలు ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్‌ను నిలయంగా మార్చాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. మంత్రి కేటీఆర్ అధ్వర్యంలో ఐటీ రంగం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని ఐటీ సంస్థలకు గమ్యస్థానంగా హైదరాబాద్ మారిందన్నారు. ప్రపంచంలోని అతి పెద్ద బహుళజాతి సంస్థలు తమ విస్తరణ కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేశాయని తెలిపారు.

గచ్చిబౌలిలోని ఆస్పైర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సేవలను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫ్లోరిడా, యూఎస్ఏ ఆధారిత సాంకేతిక సేవల సంస్థ అయిన ఫోనిక్స్ టెక్నాలజీస్ ఇక్కడ ఆస్పైర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఇచ్చేందుకు, అందుకు అనుగుణంగా ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావడం శుభ పరిణామం అని పేర్కొన్నారు.

మూడేండ్లలో 3 వేల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను కలిగి ఉండేలా విస్తరించాలని ఆకాంక్షిస్తున్నానని మంత్రి తెలిపారు. ఆవిష్కరణల విషయంలో తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్లు మొన్న విడుదలైన నీతి ఆయోగ్ సూచి వెల్లడించిందని గుర్తు చేశారు. ఆవిష్కరణల సూచీల్లో కర్ణాటక, తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో ఉంటే.. గుజరాత్, బీహార్ 14, 15 స్థానాల్లో ఉన్నాయని తెలిపారు. డబుల్ ఇంజిన్ గ్రోత్ రాష్ట్రాలు వెనుకబడ్డాయని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.

ప్రాణనష్టం లేకుండా చర్యలు చేపట్టాలి : సీఎస్ సోమేశ్‌కుమార్

హైదరాబాద్, జులై 23: ఎట్టి పరిస్థితుల్లో ఎక్కడా ప్రాణనష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సీఎస్ శనివారం జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో కురుస్తున్న క్రమంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

వరుసగా రెండు రోజులు సెలవు రోజులు వస్తున్నందున, సెలవులను ఉపయోగించకుండా పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. పొరుగు రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున వరదలు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో అన్ని రిజర్వాయర్లు, చెరువులు పూర్తిగా నిండినందున చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. రహదారులు, వంతెనలు దెబ్బతిన్న మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేయాలని చెప్పారు. పోలీసు, నీటిపారుదల, రోడ్లు భవనాలు, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖలన్ని సమన్వయంతో పని చేయాలని సూచించారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జులై 23: దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ నిర్వహించిన తొలి స్నాతకోత్సవంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. దేశ జనాభాలో సగానికి పైగా 27 ఏండ్ల వారేనని తెలిపారు. ప్రస్తుతం యువత ఆవిష్కరణల్లో చాలా చురుకుగా ఉందని కొనియాడారు. నాయకులు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, ఆర్థిక అంశాలపై దృష్టి సారించాలని కేటీఆర్ సూచించారు.

దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మహీంద్రా యూనివర్సిటీలో చదువుతున్నారని తనకు తెలుసన్నారు. అయితే హైదరాబాద్, తెలంగాణలో ఉన్న ఉద్యోగ అవకాశాలను పరిశీలించాలని, అందుకు మీ అందర్నీ ప్రోత్సాహిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రమోట్ చేసేందుకు తెలంగాణ చాంపియన్ స్టేట్‌గా ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా తెలంగాణ పెట్టుబడులను ఆకర్షించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని చెప్పడానికి తాను గర్వపడుతున్నానని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నాహాలు..

హైదరాబాద్, జులై 23: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు అంతంత మాత్రంగా ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం(2021-22) పరీక్షలకు మొత్తం విద్యార్థులు 77,369 మంది హాజరు కాగా, కేవలం 47,485 మంది మాత్రమే ఉత్తీర్ణత(61.37 శాతం) సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం(2021-22) పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 65,868 మంది విద్యార్థులు హాజరుకాగా, కేవలం 42,170 మంది మాత్రమే ఉత్తీర్ణత (64.02 శాతం) సాధించడం గమనార్హం.

కాగా.. ఇటీవల ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లి మెంటరీ పరీక్షలకు ఏర్పాటు జరుగుతున్నాయి. పరీక్షలను ఆగస్టు 1నుంచి 10వరకు నిర్వహించనున్నారు. పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేస్తున్నారు.

ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా మొత్తం 121 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, పరీక్షలకు దాదాపు 64,490 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు సమాచారం. అయితే ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సైతం హైదరాబాద్ జిల్లా మెరుగైన ఫలితాలను సాధించలేకపోయింది. శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో టాప్‌లో ఉండగా, భాగ్యనగరంగా పేరుగాంచిన హైదరాబాద్ జిల్లాలో మాత్రం ఇటు ఇంటర్మీడియట్ ఫలితాలతో పాటు, అటు 10వ తరగతి ఫలితాలు నిరాశజనకంగా నమోదయ్యాయి.

ఈ ఫలితాలపై ఇంటర్మీడియట్ బోర్డుతో పాటు ఇటీవల రిటైర్డు అయిన కలెక్టర్ శర్మన్ సైతం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. మరోవైపు 10వ తరగతి పరీక్షల ఫలితాలపై అయితే ఏకంగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డే స్వయంగా, హైదరాబాద్ జిల్లా చాలా వెనుకబడి పోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో...

మహాకవి సినారె కళాపీఠం

(సాహిత్య, కళా సామాజిక సేవా సంస్థ)

రాచాలపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా

సంస్థ 3వ వార్షికోత్సవం

మరియు

మహాకవి డా॥ సి.నారాయణ రెడ్డి గారి 91వ జయంతి ఉత్సవాలు

సాహిత్య పురస్కారాల ప్రదానం

తేది : 24-07-2022, ఆదివారం, ఉ॥ 10 గం॥లకు

వేదిక : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం, ఊర్కొండ, నాగర్‌కర్నూల్ జిల్లా.

ముఖ్యఅతిథి : డా॥ సిహెచ్.లక్ష్మారెడ్డి గారు
మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు, జడ్చర్ల

విశిష్ట అతిథి : డా॥ నందిని సిధారెడ్డి గారు, ప్రముఖ కవి
తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు

సభాధ్యక్షులు : డా॥ ఓలేటి పార్వతీశం గారు
ప్రముఖకవి, ప్రఖ్యాత వ్యాఖ్యాత

ప్రత్యేక అతిథులు : డా॥ గంటా జలంధర్ రెడ్డి గారు
అధ్యక్షులు, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి
శ్రీ పెండెం సత్యనారాయణ గారు
అధ్యక్షులు, అమ్మయాబి పెండెం ఫౌండేషన్, యాదాద్రి జిల్లా.

గౌరవ అతిథులు : శ్రీమతి బక్క రాధ జంగయ్య గారు
ఎం.పి.పి. ఊర్కొండ మండలం
శ్రీమతి బచ్చలకూర శాంతకుమారి రవి గారు
జడ్.పి.టి.సి., ఊర్కొండ మండలం
శ్రీ సత్తి అరుణ్‌కుమార్ రెడ్డి గారు
వైస్ ఎం.పి.పి. ఊర్కొండ మండలం

ఆత్మీయ అతిథి : శ్రీ కొమ్ము రాజయ్య గారు
సర్పంచ్, ఊర్కొండ గ్రామ పంచాయతి

కార్యక్రమ సమన్వయం : డా॥ పోరెడ్డి రంగయ్య
అధ్యక్షులు, తేజ సాహిత్య సేవా సంస్థ

ఆహ్వానించువారు
మల్లెకేడి రాములు
అధ్యక్షులు, మహాకవి సినారె కళాపీఠం
సెల్:8897726645

జీవన సాఫల్య పురస్కార గ్రహీత

శ్రీ బైస దేవదాసు గారు
సంపాదకులు, నేటినిజం దినపత్రిక, హైదరాబాద్

సాహిత్య పురస్కార గ్రహీతలు

డా॥ తుమ్మల దేవరావ్ గారు
ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా

డా॥ వైరాగ్యం ప్రభాకర్ గారు
ఉమ్మడి కరీంనగర్ జిల్లా

డా॥ షాజహానా గారు
ఉమ్మడి ఖమ్మం జిల్లా

శ్రీ సి.వి.శ్రీనివాస్ గారు
ఉమ్మడి నల్లగొండ జిల్లా

శ్రీ సిహెచ్.ప్రకాశ్ గారు
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

శ్రీ పుట్టి గిరిధర్ గారు
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా

డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్ గారు
ఉమ్మడి మెదక్ జిల్లా

శ్రీ వెన్నెల సత్యం గారు
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా

డా॥ భేరి సునితా రామమోహన రెడ్డి గారు
ఉమ్మడి వరంగల్ జిల్లా

డా॥ ఎస్.విజయభాస్కర్ గారు
హైదరాబాద్ జిల్లా

చరిత్రలో నేటినిజం

కం॥ ధృతిలేని- స్తుతిపాత్రదురుసు-భా
రతపై సీసపాలు జల్లిన రప్పిపుగా-భి
రతకల వీరుల సాసగ
సుతిబంచెద-సే-ఘనుని-మనోజ్ఞకుమారునే!!

(జులై 24 నటుడు మనోజ్‌కుమార్ పుట్టిన రోజు...)

-రాధశ్రీ

సెల్: 9494481210

ఔషధాలు వాడకుండా 'ఆయుష్' పెంచుకోలేమా..?

09 నవంబర్ 2014లో కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన 'మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్' (అనగానే ఆయుర్వేద, యోగా అండ్ నాచురోపతి, యునానీ, సిద్ధ, హోమియోపతి వైద్య విధానాలు) ద్వారా ప్రజారోగ్య సిద్ధికి అలోపతి విధానంతో పాటు భారతీయ స్వదేశీ వైద్య విద్యను అభివృద్ధి చేయడం, వాటి పరిశోధనలకు ఊతం ఇవ్వడం లాంటి సకారాత్మక చర్యలు తీసుకోవడానికి మార్గాలు సుగమం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రతి ఏట ఇండియాలో దాదాపు 1.7 మిలియన్లు హృద్రోగ సమస్యలతో మరణిస్తున్నట్లు తేలింది. మన దేశం మధుమేహ రుగ్మతలకు నెలవుగా, 77 మిలియన్ల డయాబెటిక్ రుగ్మతలు కలిగిన ప్రజలతో రెండవ అతి పెద్ద డయాబెటిస్ కేంద్రంగా పేరు గాంచింది. ప్రతి ఏట మధుమేహం, కాన్సర్, గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో 5.8 మిలియన్ల భారతీయులు మరణిస్తున్నారు. ప్రతి నలుగురు భారతీయుల్లో ఒకరు (25 శాతం) ఇలాంటి సంక్రమించని వ్యాధుల (నాన్-కమ్యూనికెబుల్ డిసీజెస్) బారిన పడుతన్నారని అంచనా. వైద్య ఆరోగ్య ఖర్చుల కారణంగా ఏడాదికి 4 కోట్ల భారతీయులు దారిద్ర్య రేఖ దిగువన చేరుతున్నారు.

ఆయుర్వేద వైద్య విధానం:

ఆయుష్షును కాపాడి మానసిక శారీరక అభివృద్ధి దిశగా నడిపే వేద శాస్త్రమే ఆయుర్వేదంగా 5000 ఏండ్ల కాలం నుంచి భారత్‌లో ప్రచార ఆచరణలో ఉంది. దేహం, ఇంద్రియాలు, మనసు, ఆత్మల సమ్మిళితమే జీవితమని భావించే ఆయుర్వేద శాస్త్రం వాత, పిత్త, కఫాల సమ్మేళనంగా భావిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం శరీర మౌళిక కణజాలంలో రస, మాన్స, మేధ, అస్థి, మజ్జా, శుక్ర వర్గాలు ఉంటాయని, వ్యర్థాలలో మల, మూత్ర, స్వేదాలు బహిర్గతం అవుతాయని వర్ణించబడింది. ఆయుర్వేదం ప్రకారం మానవ శరీరం దోషం, ధాతువు, మలం, అగ్ని అనబడే నాలుగు అంశాలకు ప్రాధాన్యం ఇస్తుంది. ఆహారం తీసుకోవడం, జీర్ణం కావడం, అధిశోషణం, ఆహార జీవక్రియ, శరీరంలో కలవడం లాంటి క్రియలతో ఆరోగ్యం ప్రభావితం అవుతుందని ఆయుర్వేదం నమ్ముతుంది.

యోగా శాస్త్రం:

యోగా పితామహుడు మహర్షి పతంజలి ప్రవేశ పెట్టిన 'యోగా సూత్ర'లో యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, దయన, సమాధి అనబడే ఎనిమిది అంశాలు 'అస్టాంగ యోగా'గా మానవ శరీర సమగ్రాభివృద్ధిలో దోహదపడతాయని వర్ణించబడింది. శరీర ధారుడ్యం, ఆరోగ్య సంరక్షణ, రోగనిరోధకశక్తి పెంచడానికి అష్టాంగ యోగాశాస్త్రం ఉపయోగపడుతుంది. వ్యాయామ సాధనల సమాహారాల హిందూ ఆధ్యాత్మిక రూపమే యోగా శాస్త్రమని చెప్పబడింది.

నాచురోపతి లేదా ప్రకృతి వైద్యవిధానం:

సనాతన భారత వేదాలు, గ్రంథాల్లో నాచురోపతి తత్వ పునాదులు కనిపిస్తాయి. ఔషధాలు వాడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నాచురోపతి ఉపయోగపడుతుంది. పంచభూతాలైన గాలి, నీరు, భూమి, అగ్ని, ఆకాశాలతో కూడిన ప్రకృతిలో ఆహారపు అలవాట్లను మార్చుకుంటూ రోగ నివారణ చేసే ప్రక్రియను నాచురోపతి లేదా ప్రకృతి వైద్య విధానం అంటాం.

యునానీ వైద్యవిధానం:

యునాని వైద్య విధానంలో ఆరోగ్యం, అనారోగ్య స్థితుల పలు దశలు వర్ణించబడ్డాయి. శరీరంలోని రక్తం, కఫఫం (ప్లీమ్), సఫ్రా (యెల్లో బైల్), సౌదా (బ్లాక్ బైల్) అనబడే నాలుగు ద్రవ వ్యవస్థలు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని యునాని శాస్త్రం తెలుపుతుంది. రక్తం వేడిగా, తెమడ లేదా కఫం చల్లగా, సఫ్రా వేడిగా పొడిగా, సైదా చల్లగా ఉంటాయి. ఈ ద్రవాల స్వభావాన్ని బట్టి వ్యక్తుల స్వభావాలు వేరు వేరుగా ఉంటాయని యునానీ తెలుపుతుంది.

సిద్ధ వైద్యవిధానం:

ద్రవిడుల కాలపు దక్షిణ భారతీయ అతి పురాతన సిద్ధ విధానంలో 18 ఆరోగ్య సిద్ధార్థులు రూపొందించిన వైద్యవిధానమే సిద్ధ వైద్యంగా ప్రచారం అయ్యింది. ఈ 18 మంది సిద్ధార్థుల్లో ముఖ్యమైన అగస్త్యుడిని సిద్ధ వైద్య పితామహుడిగా పిలుస్తాం. జీవిలో మనసు, శరీరమనే రెండు భాగాలు ఉంటాయని, ఆరోగ్యవంతుడిలో మనసు, శరీరం శక్తివంతంగా ఉంటాయని సిద్ధ వైద్య విధానం చెబుతుంది.

హోమియోపతి వైద్యవిధానం:

ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన హోమియోపతి (హోమోయిస్ అనగా ఒకే రకమైన అని, పేథోస్ అనగా బాధ, రోగ లక్షణం) వైద్య విధానంలో వ్యాధిని మాన్పించే సహజ సూత్రాలు పేర్కొనబడినవి. ఈ వైద్యం 'సమః సమం, షమయతి' అను పద్ధతి ద్వారా జరుగుతుంది. గత రెండు శతాబ్దాలుగా హోమియో వైద్యం ఎక్కువగా ఆచరించబడుతున్నది. హిమాలయ ప్రాంత జమ్ము కశ్మీర్, లడక్, హిమాచల్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌ల్లో ఆచరించే మరో వైద్యవిధానంగా 'సోవ-రిగ్పా'కు కూడా ఆదరణ ఉంది.

అసంబద్ధ జీవనశైలితోనే అనారోగ్యాలు:

దేశవ్యాప్తంగా సర్వసాధారణంగా కనిపిస్తున్న పలు అనారోగ్యాలకు ప్రధాన కారణం అసంబద్ధ జీవనశైలి, అపరిశుభ్ర పరిసరాల్లో జీవనమే అని గమనించాలి. పోషకాహారం, శారీరక శ్రమ లేదా వ్యాయామం, పొగాకు ఉత్పత్తులు/ఆల్కహాల్ దురలవాట్లకు దూరంగా ఉండడం, ఖర్చులేని యోగాభ్యాసం లాంటి సాధారణ జాగ్రత్తలు తీసుకోవడంతో కుటుంబంలో ఆరోగ్యభాగ్యాలు వెల్లివిరుస్తాయని మరిచిపోరాదు. ఈ కారణాలతోనే కేంద్రప్రభుత్వం 'ఆయుష్' మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. సాధారణ జనానికి ఈ వైద్య ఆరోగ్య విధానాల పట్ల అవగాహన కల్పించడం, అసంబద్ధ అనుమానాలను నివృత్తి చేయడం, మౌళిక వనరుల కల్పన, నిపుణులను అందుబాటులో ఉంచడానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ కృషి చేస్తున్నది. మనదైన వైద్య విధానమైన హోమియోపతి రంగ కళాశాలల్లో వసతులు పెంచడం, కొత్త కళాశాలలతో పాటు వైద్యశాలలను ఏర్పాటు చేయడం, పరిశోధనలను ప్రోత్సహించడం, ఔషధ వృక్షాలు/మె?క్కలను పెంచడం లాంటి చర్యలు తీసుకోవాలి.

నేడు బహుళ ఆదరణ కలిగిన అలోపతి వైద్యవిధానాన్ని క్రమంగా తగ్గించుకుంటూ 'ఆయుష్' ప్రకటించిన ఆయుర్వేద, యోగా అండ్ నాచురోపతి, యునానీ, సిద్ధ, హోమియోపతి అనబడే అత్యంత పురాతన స్వదేశీ వైద్యవిధానాలను ఆచరిస్తూ "ఔషధాలు వాడకుండా ఆరోగ్యం' అనబడే నినాదంతో భారతీయులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

నేర చరిత్ర కలిగిన రౌడీషీటర్ ప్రవీణ్ అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు -ఖమ్మం టూ టౌన్ సిఐ

ఖమ్మం, జులై 23: (నేటినిజం ప్రతినిధి): కరుడుకట్టిన నేర స్వభావం కలిగి హత్య కేసులతో పాటు ఖమ్మం, నల్గొండ జిల్లాలో పలు కేసుల్లో రౌడీషీటర్ అయిన పేరెల్లి ప్రవీణ్ ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఖమ్మం టూ టౌన్ సిఐ శ్రీధర్ తెలిపారు.

ఈనెల 2న మధ్యాహ్నం సమయంలో తన స్నేహితుడితో కలసి ఖమ్మం ఇందిరా నగర్ సులబ్ కాంప్లెక్స్ వద్ద వున్న కొత్తపల్లి ముఖేష్ అనే వ్యక్తిని

పాత గొడవలను దృష్టిలో పెట్టుకొని పేరెల్లి ప్రవీణ్, మరికొందరు కలసి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఫిర్యాదుదారుడు కొత్తపల్లి ముఖేష్ ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

18 కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి బెయిల్ పై వచ్చిన ప్రవీణ్ ..ఏదైనా భూ వివాదం వుంటే తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా అక్రమించడం, బాధితులపై దౌర్జన్యం చేయడం అడ్డుకున్న వారిని చంపుతానని బెదిరించడం పేరెల్లి ప్రవీణ్ నైజంగా మారిందని సిఐ తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల పోలీస్ సిబ్బంది అప్రమత్తం

ఖమ్మం, జులై 23 (నేటినిజం ప్రతినిధి) :సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వుండాలన్న పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయల్లో డ్రైడే నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ముందు జాగ్రత్త చర్యలు పాటించారు.

పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయల పరిసరాలలో నీరు నిల్వ, పిచ్చి మొక్కలు, నిరుపయోగంగా వున్న వస్తువులు లేకుండా శుభ్రపరిచారు. దోమల నివారణకు పిచికారీ కార్యక్రమాలను చేపట్టారు.

ఎక్కడ నీరు నిల్వ లేకుండా గుంతలను పూడ్చారు. పారిశుధ్యంలో భాగంగా చెత్త తొలగించారు.

వరదకు తెగిపోయిన రోడ్డు... ప్రయాణికుల రూట్ మ్యాప్ ఛేంజ్

మెదక్, జులై 22 (నేటినిజం ప్రతినిధి):పాపన్నపేట మండలం కొత్తపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జ్ పక్క రోడ్డు వర్షాల వల్ల పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో బుడమటపల్లి మీదుగా మెదక్ వెళ్లే ప్రయాణికులు నార్సింగి నుండి ఎనే మీదుగా అన్నారం నుండి కొత్తపల్లి నుండి మెదక్ వెళ్లాలి. ఇక మెదక్ నుండి బుడమటపల్లి వెళ్లే ప్రయాణికులు కొత్తపల్లి మీదుగా అన్నారం, ఎనే, నార్సింగ్ మీదుగా బుడమట్టపల్లి వెళ్ళాలి? అలాగే ఏడుపాయల ప్రాంతంలో ఉన్న భక్తులు ప్రజలు డ్యామ్ వద్దకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏడుపాయలకు వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం రాజగోపురం వద్దనే ఉంటది కాబట్టి అక్కడ దర్శించుకుని తిరిగి రావాలని అధికారులు సూచించారు. నీరు ప్రవహించే వద్దకు దయచేసి వెళ్లవద్దని కోరారు.

ఆజాద్ కా అమృత మహోత్సవం భాగంగా తిరుపతిలో నిర్వహిస్తున్న చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలే కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, క్రీడ, యువజన సర్వీసుల శాఖ మాత్యులు శ్రీమతి ఆర్కే రోజా

న్యూఢిల్లీ, జులై 23: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లో భాగంగా మన దేశంలోని 75 ప్రదేశాలలో చెన్ ఒలింపియాడ్ టార్చ్ రిలే నిర్వహిస్తు కార్యక్రమం లో భాగంగా ప్రతిష్టాత్మకమైన చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలేని తిరుపతి నగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీమతి ఆర్. కె. రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెస్ టార్చ్ ని ప్రదర్శించి చెస్ ప్లేయర్స్ కి ఆమె శు భాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లా డుతూ తిరుపతి జిల్లాకు చెందిన తాను క్రీడా శాఖ మంత్రిగా ఉన్న ఈ సమయంలో తిరుపతి జిల్లాకు ప్రతిష్టాత్మకమైన చెస్ ఒలింపియాడ్ రిలే రావడం గర్వకారణమని, ఇందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.

చదరంగంలో మన రాష్ట్రం నుంచి గొప్ప గొప్ప క్రీడాకారులు తమ సత్తా చాటుతు న్నారని మంత్రి అన్నారు. విజయవాడకు చెందిన గ్రాండ్ మాస్టర్, అర్జున అవార్డు గ్రహీత...కోనేరు హంపి రాష్ట్రం తరపునే కాకుండా, దేశం తరపున ప్రాతినిధ్యం వహించి ఎన్నో టోర్నమెంట్ లలో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో గెలిచి తెలుగు వాళ్ల సత్తా చాటిచెప్పారన్నారు. అదేవిధంగా మన రాష్ట్రానికే చెందిన గ్రాండ్ మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్ బాబు, గ్రాండ్ మాస్టర్ పెంటేల హరిక్రిష్ణ, గ్రాండ్ మాస్టర్ అర్జున అవార్డ్ గ్రహీత ద్రోణవల్లి హారిక, గ్రాండ్ మాస్టర్ కార్తీక్ వెంకట్ రామణ్ సైతం దేశం తరపున దేశ విదేశాల్లో విశేషమైన ప్రతిభను కనబరిచారన్నారు. రాష్ట్రంలోని చెస్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. మహాబలిపురంలో నిర్వహించబోతున్న చెస్ ఒలింపియాడ్ లో మన దేశానికి చెందిన క్రీడాకారులు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కి చెందిన గ్రాండ్ మాష్టర్ లు మంచి విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్ కు మొట్ట మొదటిసారిగా భారత దేశం ఆతిథ్యం ఇస్తోంది. ఈనెల 29వ తేదీ నుంచి ఆగష్టు 9 వరకు తమిళనాడులోని మహాబలిపురంలో నిర్వహిస్తున్నఈ చెస్ ఒలింపియాడ్ లో భాగంగా ఒలింపిక్ జ్యోతిని ఈరోజు తిరుపతికి తీసుకురావడం జరిగింది. గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జూన్ 19 న దీనిని ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, 40 జిల్లాల్లో ఈ జ్యోతిని ప్రదర్శిస్తున్నారు. మహాబలిపురంలో జరిగే ఈ చెస్ ఒలింపియాడ్ లో సుమారు 187 దేశాలకు సంబంధించిన చెస్ క్రీడాకారులు పాల్గొంటున్నారు

ఈ కార్యక్రమం లో గ్రాండ్ మాస్టర్ శ్రీ అకాష్, టీటీడీ చైర్మన్ శ్రీ. వై వీ సుబ్బా రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీమతి వాణి మోహన్ ఎఐ, శాప్ ఓఆ శ్రీ. ప్రభాకర్ రెడ్డి ఎఐ , బాలాజీ జిల్లా కలెక్టర్ శ్రీ. వెంకట్రామ్ రెడ్డి ఎఐ, తిరుపతి మునిసిపల్ కమిషనర్ శ్రీ. అనుపమ, చెస్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తిలక్, ఆజాద్‌లు యువతకు స్ఫూర్తి ప్రదాతలు ...

మహబూబాబాద్, జులై 23 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో భారతీయ జనతాపార్టీ(బీజేపీ) తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధులు బాలాగంగాధర్ తిలక్ మరియు చంద్రశేఖర్ ఆజాద్ గారల జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించడం జరిగింది.స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి పెదగాని సోమయ్య మాట్లాడుతూ బ్రిటిష్ తెల్ల దొరల చేతిలో బందీ అయిన భరతమాత విముక్తి కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమర యోధులు బాలాగంగాధర్ తిలక్ మరియు చంద్రశేఖర్ ఆజాద్ లు స్ఫూర్తి ప్రదాత లు అని కొనియాడారు. స్వాతంత్ర్యం నా జన్మ హక్కు-దాన్ని సాధించి తీరుతాం అంటూ ఎలుగెత్తి చాటిన మహానీయుడు బాల గంగాధర తిలక్ అని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల పేరుతో ధేశం మొత్తం స్వాతంత్ర్య కాంక్ష ను రగిలించి ప్రజలలో దేశభక్తిని ప్రభోధం చేసి వారు స్వాతంత్ర్య సమరంలో ముందుండి పోరాడేలా ప్రేరణ కల్పించి న తొలి తరం సమర యోధుడు తిలక్ అని తెలిపారు.అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన యువ యోధుడు చంద్రశే ఖర్ ఆజాద్ అని తెలిపారు. బ్రిటిష్ వాళ్ళకు చిక్కకుండా వివిధ రకాల మారువేశాలతో దేశంలో అనేక ప్రాంతాల్లో తిరిగి యువ తలో దేశభక్తిని పురిగొల్పి వారు ధేశమాత విముక్తి పోరాటం లో పాల్గొనే విధంగా అనేక ప్రణాళికలు రూపొందించిన మహనీ యుడు ఆజాద్ అని తెలిపారు. స్వాతంత్ర్యం తన ఇంటి పేరుగా మార్చుకుని చంద్రశేఖర్ ఆజాద్ గా మారాడని ఎంతో మంది యువతీ యువకులకు స్ఫూర్తి ప్రదాత గా నిలిచాడని కొనియాడారు.తిలక్, ఆజాద్ ల స్ఫూర్తితో నేటి తరం యువత విద్యార్థులు దేశాభివృద్ధికి చిత్తశుద్ధితో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి పరుపాటి రాం మోహన్ రెడ్డి,15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, ఎస్సీ మోర్చ మహా బాద్ పార్లమెంట్ ఇంఛార్జి అలిసేరి రవిబాబు, ఎస్టీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురం రాజకుమార్, ఎస్సీ మోర్చ అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, బీజేపీ తొర్రూరు అర్బన్ మండల నాయకులు నర్సుటి ఫలపతి రాజ్, వినయ్ కుమార్ శర్మ, గంధం రాజు,బీజేవైఎం అర్బన్ ప్రధాన కార్యదర్శి నూకల నవీన్,సి.హెచ్. శ్రీనివాస్, మచ్చ ఉదయ్,అమిం పాల్గొన్నారు.

తిరుపతిలో చెస్ ఒలింపియాడ్ టార్చ్ ర్యాలీ.. స్వాగతించిన విద్యార్థులు

తిరుపతి: చెస్ ఒలింపియాడ్ టార్చ్‌కు తిరుపతిలో ఘన స్వాగతం లభించింది. విద్యార్థులు, ప్రజలు ఘనంగా స్వాగతించారు. టార్చ్ ర్యాలీ తిరుపతిలోని ఎస్‌వీ ఆర్ట్స్ కాలేజీ నుంచి ఐకానిక్ వేదిక మహతి ఆడిటోరియం వరకు కొనసాగింది. దారిపోడవునా వివిధ పాఠశాలల విద్యార్థులు బారులు తీరి నిల్చుండి టార్చ్‌కు స్వాగతం పలికారు. ఈ టార్చ్ ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, క్రీడాకారులు, ఎన్‌సీసీ కాడెట్స్ పాల్గొన్నారు. రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్‌కే రోజా ఈ ర్యాలీలో పాల్గొని విద్యార్థులు, క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

ఆంధ్ర రాష్ట్రం గర్వించదగ్గ చెస్ క్రీడాకారులు , గ్రాండ్ మాస్టర్‌లు దేశ విదేశాలలో ప్రతిభ కనపరుస్తున్నారని, అర్జున అవార్డు గ్రహీత కోనేరు హంపి, గ్రాండ్ మాస్టర్ మునుసూరి రోహిత్, లలిత్ బాబు వంటి వారు మచ్చుతునకలు అని ఈ సందర్భంగా మంత్రి రోజా అభివర్ణించారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. చివరగా చెస్ గ్రాండ్ మాస్టర్ ఆకాశ్‌కు ఒలింపియాడ్ టార్చ్‌ను మంత్రి రోజా అందించారు. ఇక్కడి నుంచి చెస్ ఒలింపియాడ్ టార్చ్ పుదుచ్చేరి వెళ్లనున్నది.

44వ ద్వైవార్షిక అంతర్జాతీయ చెస్ ఒలింపియాడ్‌కు ఈసారి భారతదేశం ఆతిథ్యం ఇస్తున్నది. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 9 వరకు తమిళనాడు మహాబలిపురం పట్టణంలో ఈ మెగా టోర్నమెంట్ జరుగనున్నది. దేశంలోని పలు నగరాల్లో ఈ చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలే నిర్వహిస్తున్నారు. టోర్నీ ప్రారంభమయ్యే నాటికి ఈ టార్చ్ మహాబలిపురం చేరుకుంటుంది.

శ్రీశైలానికి భారీగా ఇన్ఫ్లో.. నిండుకుండలా జలాశయం

కర్నూలు, జులై 23: ఎగువనుంచి వస్తున్న వరదలతో శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. దీంతో శనివారం ఉదయం శ్రీశైలం ఆనకట్ట గేట్లు ఎత్తడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. మంత్రి అంబంటి రాంబాబు శుక్రవారం సాయంత్రమే శ్రీశైలం చేరుకున్నారు. కాగా, శుక్రవారం రాత్రి 9 గంటల వరకు శ్రీశైలం జలాశయానికి అటు తుంగభద్ర, ఇటు జూరాల నుంచి పెద్ద ఎత్తున వరద వస్తోంది. ప్రస్తుతం 1,62,726 క్యూసెక్కుల నీటి ప్రవాహం చేరుతుంది. ఇందులో జూరాల నుంచి 40 వేల క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 71, 172 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇదే సందర్భంలో శ్రీశైలం కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 63 వేల క్యూసెక్కులు దిగువకు రిలీజ్ చేస్తున్నారు. కాగా, ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీశైలం జలాశయం నుంచి వివిధ కాలువలకు అటు తెలంగాణ, ఇటు ఏపీ విడుదల చేశాయి.

తెలంగాణలోని కల్వకుర్తికి 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, ఏపీలోని హంద్రీనీవాకు 1013 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు నుంచి 17 వేల క్యూసెక్కుల చొప్పున 83,266 క్యూసెక్కుల నీళ్లు విడుదల చేస్తున్నారు. అయితే సాయంత్రానికి ఇన్ఫ్లో తగ్గడంతో కాలువలకు నీటి విడుదలను నిలిపివేశారు. శుక్రవారం రాత్రి వరకు శ్రీశైలం డ్యాం 885 అడుగులకు గాను 881.90 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయంలో 215 టీఎంసీల నీటి నిల్వకు గాను 198. 3623 టీఎంసీలున్నాయి. అంటే జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టంకు మరో 17 టీఎంసీల చేరువలో ఉంది.

తిరుపతిలో దారుణం.. చికెన్ సెంటర్ యజమానిపై అటాక్, కత్తితో పొడిచి చంపేశాడు!

తిరుపతి,జులై 23: : ఏపీలోని తిరుపతి సిటీలో దారుణం జరిగింది. చంద్రబాబు కాలనీలో నివాసం ఉంటున్న చికెన్ సెంటర్ యజమాని స్టాఫ్ రాజా (25)ని శుక్రవారం రాత్రి కత్తితో పొడిచి చంపేశారు. చికెన్ సెంటర్ వద్ద రాజు మద్యం మత్తులో ఘర్షణ పడుతుండడంతో మాజీ వలంటీర్ నాని అనే వ్యక్తి ఈ హత్య చేసినట్టు తెలుస్తోంది. దీంతో నానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య విషయం తెలియడంతో డీఎస్పీ మురళి కృష్ణ, అలిపిరి సీఐ అబ్బన్న, ఎస్సై రెడ్డప్ప సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మర్డర్ కేసు విషయంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఆరోగ్యశాఖ మంత్రి రజిని..

తిరుపతి,జులై 23: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఈరోజు ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కొద్దిసేపు మంత్రితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, డాక్టర్ ఆర్.ఆర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకి ఊహించని సర్‌ప్రైజ్- విమాన పైలట్‌గా కనిపించిన తనయుడు

న్యూఢిల్లీ, జులై 23: కన్నవారికి ఓ సర్ప్రైజ్ ఇచ్చాడు ఓ తనయుడు. తాను పైలెట్ గా విధులు నిర్వహిస్తున్న విమానంలోనే తల్లిదండ్రులను ఢిల్లీ నుంచి స్వస్థలమైన రాజస్థాన్ లోని జైపూర్ కి తీసుకువెళ్ళాడు. టూ వీలర్, ఆటో, కారు.. ఇలా ఏ వాహనం కొన్నా ముందుగా.. తల్లిదండ్రులకు, తో బుట్టువులకు చూపించుకోవడం.. వారిని ఎక్కించుకుని ఒక రౌండ్ కొట్టి రావడం సంతోషకరమైన విషయం. అలా ఆ కొడుకు కూడా తన సంతోషాన్ని పంచుకోవాలనుకున్నాడు.

అయితే తాను నడిపేది.. ఏ బుల్లెట్ బండో.. కారో.. లేదా జీపో కాదు.. విమానం.. అతను పైలట్.. తాను విమానం నడిపుతూ తల్లిదండ్రులను అందులో తిప్పాలనుకున్నాడు. దీనికోసం వారికి స్వీట్ సర్ ప్రైజ్ కూడా ఇచ్చాడు. వారికి విమానం ఎక్కిన తరువాత కాని దాని పైలెట్ తన కుమారుడే అని తెలియలేదు. ఊహించని ఈ పరిణామానికి వారు ఎంతో ఆనందానికి లోనయ్యారు. పైలెట్ కమల్ కుమార్ దీనికి సంబంధించిన ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. అది కాస్తా వైరల్ గా మారింది. ఈ వీడియోలో చూపించిన దాని ప్రకారం పైలెట్ తల్లిదండ్రులు ఢిల్లీ-జైపూర్ విమానం ఎక్కారు అయితే తాము ప్రయాణిస్తున్న విమానంలో విధుల్లో ఉన్నది తన కుమారుడే అన్న విషయం అప్పటికి వారికి తెలియదు. అంతలోనే ఊహించని విధంగా ప్రవేశ ద్వారం వద్ద అతడు వారికి కనిపించాడు. దీంతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యాడు. వెంటనే తల్లి అతని దగ్గరికి వెళ్లి ప్రేమగా కొడుకు చేయి పట్టుకుని మురిసిపోయింది. ఆ తర్వాత తల్లిదండ్రులతో కలిసి దిగిన ఫోటోలు షేర్ చేస్తూ తన సంతోషాన్ని పంచుకున్నాడు ఆ పైలట్.

జన్మదినం సందర్భంగా మొక్కను నాటిన సుడా చైర్మన్

ఖమ్మం, జులై 23: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టే గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా శనివారం ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ లోని (సుడా) స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయం నందు సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న 3094 చోట్ల గుంతల పూడ్చివేత

హైదరాబాద్, జులై 23: గ్రేటర్‌లో గుంతలు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు జీహెచ్ఎంసీ చర్యలు తీసుకుంటున్నది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో గ్రేటర్ రహదారులు భారీగా దెబ్బ తిన్నాయి. చాలా చోట్ల రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గుంతలు పూడ్చే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. పది రోజుల వ్యవధిలోనే నగర వ్యాప్తంగా 3094 చోట్ల గుంతలను పూడ్చినట్లు ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల రహదారుల గుంతలను సకాలంలో పూడ్చటంలో నిర్లక్ష్యం వహించిన ఏఈలకు తొలుత నోటీసులు జారీ చేయడం, సదరు అధికారి వివరణ ఆధారంగా జరిమానా విధించడం లాంటి చర్యలు చేపడుతున్నారు. దీంతో రహదారులపై గుంతల ఏర్పాటుకు ఏ మాత్రం ఆస్కారం లేకుండా, వాహనదారులకు సాఫీ ప్రయాణమే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మొబైల్, మినీ మొబైల్ స్టాటిస్టికల్ మాన్‌సూన్ బృందాలను ఏర్పాటు చేసి రోడ్డుపై నిలిచిన నీరు తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఎల్బీనగర్ జోన్‌లో 763, చార్మినార్ జోన్ ? 6 సరిల్ పరిధిలో 855, ఖైరతాబాద్ జోన్‌లోని ? 5 సరిల్‌లో 447, శేరి లింగంపల్లి జోన్‌లో 220, కూకట్‌పల్లి జోన్ ? 5 సరిల్‌లో 529, సికింద్రాబాద్ జోన్ ? 5 సరిల్ పరిధిలో ఏర్పడిన 280 గుంతలను పూడ్చి వాహనదారులకు

వర్షాకాలం దరిమిలా అక్టోబరు 31వ తేదీ వరకు కొత్తగా రోడ్డు తవ్వకాలను నిలిపివేస్తూ జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకున్నది. ఐతే, వివిధ ప్రైవేట్ సంస్థలు భూగర్భ కేబుల్స్ తదితర పనులతో పాటు విద్యుత్, వాటర్ బోర్డు, బీఎస్ఎన్ఎల్ లాంటి ప్రభుత్వ సంస్థలు అత్యవసర పనుల నిమిత్తం రోడ్డు కటింగ్ అనుమతులకు జీహెచ్ఎంసీ అనుమతి కోరుతున్నది. దీంతో ఆయా శాఖలు మౌలిక సదుపాయాల కల్పన, పలు అభివృద్ధి పనులు, ప్రజలు ఇబ్బందులు తొలగించడంలో అత్యవసర పనుల నిమిత్తం మాత్రమే జీహెచ్ఎంసీ అనుమతులు మంజూరు చేస్తున్నది. రోడ్డు కటింగ్‌కు అనుమతి ఇచ్చిన ప్రాంతాల్లో పనులు పూర్తయిన వెంటనే సంబంధిత రహదారుల మరమ్మతులను వెంటనే పూర్తి చేస్తున్నారు.

వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

ఖమ్మం, జులై 23: (నేటినిజం ప్రతినిధి): సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య విజ్ఞప్తి మేరకు గోదావరి వరద బాధితులకు సత్తుపల్లి కిరాణ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 500 రూపాయలు విలువగల నిత్యవసర సరుకులతో కూడిన 150 కిట్లను పంపిణీ చేయుటకు సిద్ధం చేయగా సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిన సత్తుపల్లి కిరాణ మర్చంట్ అసోసియేషన్ వారిని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అభినందించారు. గోదావరి వరద బాధితుల్లో ఆదివాసీలు ఎక్కువగా నష్టపోయారని వారికి చేయూతగా ప్రతి ఒక్కరు దాతృత్వంతో ముందుకు వచ్చి సహాయం అందించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమ మహేశ్వరరావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, సత్తుపల్లి టౌన్ టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లూరు అంకమరాజు, గుడిమెట్ల గాంధీ, వనమా వాసు, నడిపల్లి లక్ష్మీనారాయణ, వేముల శ్రీనివాస రావు, సాయి రామ్ శ్రీను, బచ్చు ధర్మారావు, గంగిశెట్టి కన్నా, జల్లిపల్లి చక్రధర్ రావు, తదితరులున్నారు.

దేశ చదరంగంలో తెలుగువాడు సత్తా చాటాలి-మంత్రి ఆర్కే రోజా

తిరుపతి, జులై 23:దేశ చదరంగంలో తెలుగువాడు సత్తా చాటాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, క్రీడ, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. క్రీడాశాఖ మంత్రిగా ఉన్న ఈ జిల్లాకు ఇంత ప్రతిష్టాత్మకమైన చెస్ ఒలింపియాడ్ రిలే రావడం గర్వకారణం అని, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామని మంత్రి తెలిపారు. శనివారం స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుండి మహతి ఆడిటోరియం వరకు చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలే ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా సాంస్కృతిక శాఖ మంత్రి, గ్రాండ్ మాస్టర్ అకాష్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బా రెడ్డి, స్థానిక శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణి మోహన్, శాప్ ఎం.డి.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, తిరుపతి నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి, జె న్ అకాడమీ అధ్యక్షులు నూకతోటి రాజేష్, చెస్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ఎన్.సి.సి, స్కౌట్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని, మహతి ఆడిటోరియంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ర్యాలీ నిర్వహణ అనంతరం మహతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ? ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లో భాగంగా మన దేశంలోని 75 ప్రదేశాల్లో చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలే నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రతిష్టాత్మకమైన చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలే తిరుపతి నగరంలో నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ జిల్లాకు చెందిన వ్యక్తినైన తాను క్రీడా శాఖ మంత్రిగా పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన చెస్ ఒలింపియాడ్ కు మొట్ట మొదటిసారిగా మన దేశం ఆతిథ్యం ఇవ్వబోతుందని, ఈనెల 29వ తేదీ నుండి ఆగష్టు 9 వరకు తమిళనాడులోని మహాబలిపురంలో ఈ చెస్ ఒలింపియాడ్ జరగనున్నదని, ఇందుకు కారణమైన ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, తక్కిన రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్న ఎన్.సి.సి. ఆంధ్ర 29 బెటాలియన్ కల్నల్ సోమన్ అధికారి, తిరుపతి, చిత్తూరు జిల్లాల క్రీడా ప్రాధికార సంస్థల ప్రతినిధులను, అతిథులను ఘనంగా సన్మానించారు.

శ్రీశైలం ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తివేత.. సాగర్ వైపు కృష్ణమ్మ పరవళ్లు..

శ్రీశైలం, జులై 23: శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. జలాశయం నిండు కుండలా మారింది. ఈ క్రమంలో ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గేట్ల నుంచి వరద నీరు పాల ధారలా ఉప్పొంగింది. ఈ దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. గేట్లను ఎత్తిన తర్వాత ఆ జల దృశ్యాన్ని పర్యాటకులు తమ కెమెరాల్లో బంధించారు.

ఇక శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో ఎత్తారు. అంతకుముందు కృష్ణమ్మకు మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ప్రాజెక్టు 6, 7, 8 నంబర్ల గేట్లను ఎత్తి 27 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

దీంతో కృష్ణమ్మ.. నాగార్జున సాగర్ వైపు పరవళ్లు తొక్కుతోంది. జులై నెలలోనే శ్రీశైలం గేట్లు ఎత్తేయడం.. 12 ఏండ్లలో ఇది మూడోసారి.

ప్రాజెక్టుకు 1,11,970 క్యూసెక్కుల నీరు వస్తుండగా 57,751 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 882.50 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు కెసాసిటీ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుతం 202.04 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, జులై 23: ఎవరూ అధైర్య పడవద్దని బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర రావు అన్నారు. ఎడతెరిపిలేని వర్షాలకు రాత్రి వరంగల్ నగరంలోని మండిబజార్ లో కూలిపోయిన ఇంటిని, ఎంజీఎం ఆసుపత్రిలో ప్రమాదంలో మరణించిన మృతదేహాలను మంత్రి పరిశీలించారు. వారి కుటుంబాలను పరామర్శించారు. మంత్రితో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు, ఓఒంలు నన్నపునేని నరేందర్, అరూరి రమేష్ తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో శిథిలావస్థలో ఉన్న 379 ఇండ్లను గుర్తించి యాజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. వాటిలో ఇప్పటికే 145 పురాతన ఇండ్లు కూల్చేశాం.. నోటీసులు అందుకున్న యాజమానులు వారే ఇండ్లను తొలగించుకోవాలన్నారు. లేకపోతే ఉచిఓఅ అధికారులే తొలగిస్తారని ప్రజలు సహకరించాలని కోరారు. వర్షాలు, వరదల సమయంలో సెల్ఫీల కోసం, చేపల కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం అంచనాలు సిద్ధం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటారు.

వ్యవసాయ కూలీలతో కలిసి సాగు పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ల

అమరావతి, జులై 23: వ్యవసాయం అంటే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఎంతో ఇష్టం.వర్షాలు పడుతుండడంతో ఆయన తన పొలాల్లో వ్యవసాయపనులు ప్రారంభించారు. ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలోని తన పొలంలో వ్యవసాయకూలీలతో కలిసి సాగు పనుల్లో పాల్గొన్నారు. కలుపు ఏరి, పొలంలో నాట్లు వేయడానికి అనువుగా మెరకలు, పల్లాలను చదును చేయడానికి నిచ్చెన లాగారు. ఆపై, నారుమడికి విత్తనాలు చల్లారు. కంది నాట్లు వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీలతో కలిసి భోజనం చేశారు.

ఏడుపాయలలో గంగమ్మ పరవళ్లు..



మెదక్, జులై 23 (నేటినిజం ప్రతినిధి):ఏడుపాయలలో గంగమ్మ తల్లి ఉప్పొంగింది.. వనదుర్గాదేవి ఆలయ మండపంలో నుండి నీరు ప్రవహిస్తుంది.. దీంతో ఆలయ అధికారులు తాత్కాలికంగా గుడిని మూసివేశారు. అయితే రాజగోపురంలో అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. గంగమ్మ తల్లి పరవళ్లను తలకించేందుకు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. నిన్న కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో జలాశయాలకు జలకళ వచ్చింది.. ఏడుపాయల ఆలయ అందాలను తలకిస్తూ భక్తులు ఎంజాయ్ చేస్తున్నారు.

చంద్రబాబు పర్యటన ప్రచారానికే : ఏపీ మంత్రి రాంబాబు

అమరావతి, జులై 23: ఈసారి గతంలో కంటే వరదలు ముందే వచ్చాయని దీంతో రాష్ట్రంలోని జలాశయాలు కళకళలాడుతున్నాయని ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. శ్రీశైలం డ్యాం పూర్తిగా నిండిందని తెలిపారు. దీంతో డ్యాం గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేశామని తెలిపారు. వరద బాధితులను పరామర్శించడానికి బాబు టీడీపీ జెండాలతో వెళ్తారా అని ప్రశ్నించారు.

వరద రాజకీయం చేయాలనే ఉద్దేశంతో ఆయన గోదావరి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారని ఆరోపించారు. పరామర్శకంటే ప్రచారం కోసమే పర్యటిస్తున్నారని విమర్శించారు. పార్టీ జెండాలతో కలిసి పరామర్శించడానికి వెళ్లే దౌర్భాగ్య పరిస్థితి వారికి ఏర్పడిందని అన్నారు. టీడీపీ నాయకులు సేవా దృక్పదంతో వరద ప్రాంతాల్లో పర్యటించడం లేదని ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై బురద చల్లడానికే వెళ్తున్నారని ఆరోపించారు.

పోలవరం డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడం టీడీపీ ప్రభుత్వం చేసిన చారిత్రాతిక తప్పిదమని అన్నారు. కాఫర్ డ్యామ్ పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్ ఎవరైనా నిర్మిస్తారా అని మరోసారి ప్రశ్నించారు.

వరద సాయం ఏదీ..? కేంద్రం తీరుపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఫైర్

ఇంద్రవెల్లి, జులై 23: రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా సంభవిస్తున్నాయని, అయినా కేంద్రం ఎలాంటి సహాయం అందించడం లేదని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. వరదలతో రూ.1400కోట్ల వరకు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేసి.. తక్షణ సహాయంగా వెయ్యి కోట్లు ఇవ్వాలని కోరినా.. ఇప్పటి వరకు ఉలుకూ పలుకు లేదంటూ కేంద్రం తీరుపై మండిపడ్డారు. నాలుగేండ్లలో వివిధ రాష్ట్రాలకు వరద సహాయం అందించిన కేంద్రం.. తెలంగాణకు మాత్రం రూపాయి ఇవ్వలేదన్నారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్రాలకు అండగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించిందని విమర్శించారు. ఆర్థిక సహాయం చేయాల్సింది పోయి.. పాలు, పప్పు, ఉప్పులపై జీఎస్టీ రూపంలో కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై పన్నుల భారం మోపుతుందని ధ్వజమెత్తారు. తక్షణమే రాష్ట్రానికి రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

దళితులు స్వావలంబన సాధించేందుకే దళితబంధు : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

వనపర్తి, జులై 23: శతాబ్దాలుగా సామాజిక వివక్షకు, అణచివేతకు గురవుతోన్న దళితులను ఉద్ధరించేందుకు సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన గొప్ప పథకమే దళితబంధు అని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దళితుల్లో ఆర్థిక సాధికారత, స్వావలంబన సాధించేందుకు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కోస్గి రోడ్డులో దళితబంధు లబ్ధిదారుడు అరవింద్ రూ.10లక్షల నిధులతో ఏర్పాటు చేసిన బాలాజీ ఎలక్ట్రికల్ వర్క్స్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు.

పథకం కింద ఒక్కో నిరుపేద దళిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తోందన్నారు. ఈ సాయంతో ఆర్థికంగా నిలదొక్కుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. దళితబంధు అణచివేతపై అస్త్రం లాంటి పథకమని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న ముదిరాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యాదయ్య, పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

హైదరాబాద్, జులై 23: టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఆస్ట్రేలియాలో ఘనంగా నిర్వహించారు. సిడ్నీ, మెల్‌బోర్న్, కాన్‌బెర్రా, బ్రిస్బేన్, అడిలైడ్ పట్టణాలలో టీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి కాసర్ల ఆధ్వర్యంలో కేటీఆర్ బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాన్‌బెర్రాలో రవి సాయల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేశారు.

ఈ కార్యక్రమ అనంతరం ఏర్పాటు చేసిన వేడుకలో రవి సాయల మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ కోసం టీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో కల్వకుంట్ల సాయికృష్ణ ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు. ఈ వేడుకల్లో టీఆర్ఎస్ ఆస్ట్రేలియా కోర్ కమిటీ నాయకులు ఝాన్సీ నోముల, గాయత్రి అరిగెల, రాకేష్ లక్కరసు, సిద్దు గొర్ల, రమేష్ కైల రుద్ర కొట్టు, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

10 తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానించిన బొల్లం దేవరాజ్

రాజన్న సిరిసిల్ల, జులై 23 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని బోయినపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2021 2022 సంవత్సరం 10 తరగతి పరీక్ష ఫలితాల్లో 10 జిపిఏ సాధించిన రాజవర్ధన్ రెడ్డిని యంగ్ మెన్స్ అంబేద్కరిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొల్లం దేవరాజ్ శాలువాతో ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో పిన్సిపల్ లింగాల నరేంద్ర కుమార్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు

కాకతీయ పద్య కవితా వేదిక, వరంగల్

ఆహ్వానము

శ్రీ మైలవరపు సాయికృష్ణ
(సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, కాలిఫోర్నియా, అమెరికా)

అష్టావధానము

తేదీ: 24-07-2022, ఆదివారం ఉ.9 గం.
వేదిక: ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల (KDC ఎదురుగా), హన్మకొండ

ముఖ్య అతిథి :- 'శతావధాని' శ్రీ ఆముదాల మురళి గారు, తిరుపతి
విశిష్ట అతిథి: :- శ్రీ పేరి దివాకర్ గారు, ప్రిన్సిపాల్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల, హన్మకొండ
సంచాలకులు :- 'సమస్యాపృచ్ఛక చక్రవర్తి' శ్రీ కంది శంకరయ్య గారు

-: పృచ్ఛకులు :-
నిషిద్ధాక్షరి :- 'అష్టావధాని' శ్రీ తిరుక్కోవళ్ళూర్ శ్రీహర్ష గారు
సమస్య :- శ్రీ యన్.వి.యన్. చారి గారు
దత్తపది :- 'అష్టావధాని' శ్రీ చేపూరి శ్రీరామ్ గారు
వర్ణన :- శ్రీ కొండా యాదగిరి గారు
న్యస్తాక్షరి :- శ్రీ అక్కెర కరుణాసాగర్ గారు
ఆశువు :- శ్రీమతి తాడూరి అరుణాదేవి గారు
వార గణనము :- శ్రీ పాతూరి రఘురామయ్య గారు
అప్రస్తుత ప్రశంస :- శ్రీ పల్లేరు వీరాస్వామి గారు

కార్యక్రమ నిర్వహణ
శ్రీ గుంటి విష్ణుమూర్తి గారు, శ్రీ సిద్దెంకి బాబు గారు

అందరూ ఆహ్వానితులే

కాంగ్రెస్ పార్టీకి షాక్.. మంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో చేరికలు

వనపర్తి, జులై 23: వనపర్తి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ పదవికి నిరంజన్ పాషా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో నిరంజన్ పాషా టీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నిరంజన్ పాషాకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు మంత్రి నిరంజన్ రెడ్డి. నిరంజన్ పాషాతో పాటు చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, స్వామిగౌడ్, అల్తాఫ్, శ్రవణ్, ఇస్మాయిల్, అరిఫ్‌తో పాటు పలువురు టీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులు, అభినందనలే ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. గత మూడేండ్లుగా అభివృద్ధి మీద తప్ప ఎక్కడా రాజకీయాలు మాట్లాడలేదని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి.. చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించమని కోరుతానని తెలిపారు. తాను చేసిన పనులు, చేస్తున్న అభివృద్ధి సత్యం అయితేనే తనకు అండగా నిలవాలని కోరుతానని చెప్పారు.

వనపర్తి పట్టణంలో దుర్గంధంతో నిండిన కందకాన్ని శుభ్రం చేసి మార్కెట్‌ను నిర్మించడం జరిగిందన్నారు. అంతకు ముందు కందకం ప్రాంతం దోమలు, పందులు, పాములు, మురుగునీరుతో నిండి ఉండేదని గుర్తు చేశారు. దాని నిర్మాణం చేపట్టినప్పుడు ప్రజలు అపోహ పడ్డారు.. నిర్మాణం పూర్తయ్యాక ఇప్పుడు ఆనంద పడుతున్నారని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

తుది దశకు వనపర్తి మెడికల్ కళాశాల పనులు : మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జులై 23: వనపర్తి : ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ నాలుగు నెలల్లో నర్సింగ్ కళాశాల నిర్మాణం పూర్తవుతుందని, తుది దశకు కళాశాల నిర్మాణ పనులు చేరాయన్నారు. ఐదుల్యాబ్‌లు, రెండు లెక్చర్ హాళ్ల నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు.

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణకు అనుగుణంగా భవనాలు సిద్ధమయ్యాయని, అనుమతులు పూర్తయిన వెంటనే ఎంసెట్ కౌన్సెలింగ్‌లో వనపర్తి మెడికల్ కళాశాల ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు.

విద్యార్థులు వచ్చే వరకు పూర్తి స్థాయిలో కళాశాల, వసతిగృహాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వనపర్తి మెడికల్ కళాశాల క్యాంపస్ మిగతా కళాశాలలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు అదృష్టవంతులు అనడంలో సందేహం లేదన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి అన్నివిధాలా అనుకూల వాతావరణం ఉందన్నారు. భవన నిర్మాణానికి కృషి చేసిన అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన అడిషనల్ డీజీపీ వై.నాగిరెడ్డి

ఖమ్మం, జులై 23: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను అడిషనల్ డీజీపీ వై.నాగిరెడ్డి సందర్శించారు. ఈరోజు నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ విచ్చేసిన అడిషనల్ డీజీపీ ని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ తో కలసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్? నిర్వహణ, పోలీసుల పనితీరు, స్టేషన్? రికార్డులను తనిఖీ చేశారు. కేసుల వివరాలు, శాంతి భద్రతల ఆంశలపై పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని భద్రత పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రమాదాలు జరిగే ప్రదేశాలను సంబంధిత శాఖలతో సంప్రదించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రధానంగా విధినిర్వహణలో రాణించడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలందించించేందుకు అమలవుతున్న ఫంక్షనల్ వర్టికల్స్ విధానంపై, రిఎస్ ఇంప్లిమెంట్ పై సిబ్బంది మరింత దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితుల ఫిర్యాదుల పరిష్కారానికి అవసరమైన చట్టపరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని సూచించారు.

కార్యక్రమంలో రూరల్ ఏసీపీ భస్వారెడ్డి, సిఐ సతీష్ , ఎస్సై ప్రవంతి పాల్గొన్నారు.

పాడేరు ట్రైబల్ స్కూళ్లో ర్యాగింగ్.. ఆరుగురికి అస్వస్థత

అమరావతి, జులై 23: అల్లూరి మన్యం జిల్లా: ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలకే పరిమితమైన ర్యాగింగ్ భూతం.. ఇప్పుడు మన్యం ప్రాంతాలకు కూడా విస్తరించింది. పెద్ద పెద్ద విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ఇప్పటివరకు మనం చూశాం. మారుమూల గిరిజన సంక్షేమ పాఠశాలల్లోనైతే ర్యాగింగ్ అంటే అర్థం కూడా తెలియదు. అట్లాంటి స్కూళ్లో ర్యాగింగ్ జరగడం.. సీనియర్ల చేష్టలకు ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురై దవాఖాన చేరడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

వివరాల్లోకెళితే.. అల్లూరి సీతారామారాజు మన్యం జిల్లాలోని తలరసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో ర్యాగింగ్ జడలు విప్పింది. పదో తరగతి విద్యార్థులు తమకన్నా చిన్న వారిని ర్యాగింగ్ పేరుతో వేధించారు. స్కూళ్లో లీడర్‌షిప్ చేస్తున్నారన్న అక్కసుతో.. ఎక్కువగా ఉప్పు కలిపిన ఆహారాన్ని 9 వ తరగతి విద్యార్థులతో బలవంతంగా తినిపించారు. దాంతో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వార్డెన్ వెంటనే వారిని పాడేరులోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ముగ్గురు విద్యార్థులు బలవంతంగా వారితో ఉప్పు ఎక్కువగా కలిపిన అన్నం, కూరలను తినిపించడం వల్లనే వారు అస్వస్థతకు గురయ్యారని ఉన్నతాధికారులకు వార్డెన్ సమాచారమిచ్చారు.

ఈ విషయం తెలియగానే మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి హుటాహుటిన దవాఖానకు వచ్చి అస్వస్థతకు గురైన చిన్నారులను పరామర్శించారు. ఎలా అస్వస్థతకు గురయ్యారో వారిని అడిగి తెల్సుకున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లో ఇలాంటి సంఘటన జరుగడం తనను ఎంతో ఆశ్చర్యానికి గురిచేసిందని ఈశ్వరి చెప్పారు. ఈ ర్యాగింగ్ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్త మండలాల ఏర్పాటుపై ఎమ్మెల్సీ కవిత హర్షం

హైదరాబాద్, జులై 23: పరిపాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యార్థాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేయడంపై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాలో మూడు కొత్త మండలాలు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. డొంగేశ్వర్, ఆలూరు, సాలూర కేంద్రంగా కొత్త మండలాలను ఏర్పాటు చేయనున్నారు. తమ ప్రతిపాదనను ఆమోదించినందుకు సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 13 మండలాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించిన మహనీయుడు తిలక్ : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ జులై 22:భారత జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించిన మహనీయుడని బాలగంగాధర్ తిలక్ అని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 166వ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ క్లాక్ టవర్ వద్ద తిలక్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అలాంటి మహనీయున్ని స్మరించుకోవడం మన అదృష్టమని మంత్రి పేర్కొన్నారు.

బోనమెత్తిన స్మార్ట్ కిడ్జ్ విద్యార్థులు

ఖమ్మం, జులై 23 (నేటినిజం ప్రతినిధి) :ఆషాఢ మాసం బోనాల జాతర పండుగను స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో అంగరంగ వైభవంగా చిన్నారుల మధ్య పాఠశాల యాజమాన్యం నిర్వహించారు.

డప్పు దరువులు, నృత్యాలు పోతురాజు విన్యాసాలతో వివిధ రకాల దేవతల వేషధారణతో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, ప్రాచీనం నుండి ఆనవాయితీగా వస్తున్న బోనాల పండుగ తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతుందని, మానవతా విలువలు ప్రాచీన సంస్కృతిని విద్యార్థులకు తెలియజేస్తూ పండగల యొక్క విశిష్టతను దేవతల యొక్క ప్రాధాన్యతను ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలంతా సుభిక్షంగా జీవించేలా ఆశీస్సులు ఇవ్వాలని వేడుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య మరియు పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు చిన్నారులు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలి

-టి యూ డబ్ల్యు జే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా

రాజన్న సిరిసిల్ల, జులై 23 (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు వెంటనే జారీ చేయాలనీ టీ యూ డబ్లూ జే రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా కలెక్టర్ ను కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. గత నెలరోజుల క్రితం అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ అధ్యక్షతన మొదటి అక్రిడిటేషన్ కమిటీ నిర్వహించారు. అనివార్య కారణాల వల్ల మొదటి సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు, తీర్మానాలు జరుగలేదు.కావున వెంటనే అక్రిడిటేషన్ కమిటీతో సమావేశం నిర్వహించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను అందించాలని వినతి పత్రం లో పేర్కొన్నారు. తెలంగాణలో సగానికిపైగా జిల్లాల్లో అక్రిడిటేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించి, చాలా చోట్ల అక్రిడిటేషన్ కార్డులను ప్రింట్ చేసి జర్నలిస్టులకు అందజేయడం జరిగిందనీ గర్తు చేశారు.మంత్రి కే టీ రామారావు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాత్రం జర్నలిస్టులకు సంబంధించిన అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ పెండింగ్లో ఉండడం దురదృష్టకరంగా భావిస్తున్నామనీ విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్ చొరవ తీసుకొని అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, సాధ్యమైనంత తొందరలో జర్నలిస్టు లకు కార్డులను అందించాలని వినతి పత్రం లో పేర్కొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థ పుమాధవి

రాజన్న సిరిసిల్ల, జులై 23 (నేటినిజం ప్రతినిధి): ఆర్య వైశ్య సోదరులు సామాజిక సేవలో ఎప్పుడూ ముందుంటారని ఇలాగే అన్ని రంగాల్లో ఎదిగే ముందుండాలని వేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె ముందుగా నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులు రేణికింద అశోక్ ప్రధాన కార్యదర్శి ఐత వెంకటేశ్వర్లు కి అలాగే కార్యవర్గ సభ్యుల కు శుభాకాంక్షలుతెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రమేష్ బాబు సహకారంతో పట్టణఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తామని వారు అన్నారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మమ్మల్ని ఆహ్వానించినందుకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కార్యవర్గానికి ఆర్యవైశ్య సోదర సోదరీమణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గౌరవ కౌన్సిలర్ మారం కుమార్,ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రతినిధులు పట్టణ ఆర్యవైశ్య సోదర సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఉన్న గుంతల్లో నాట్లు వేస్తూ నిరసన

మెదక్, జులై 23 (నేటినిజం ప్రతినిధి):సదాశివపేట పట్టణం లోని సిద్దాపూర్ కాలనీకి వెళ్లే రోడ్డును తక్షణమే బాగు చేయాలని నిరసిస్తూ సీపీఎం నాయకులు రోడ్లపై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే చెరువుల మారే ఈ రోడ్డు ప్రజలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గతంలో 40 లక్షలు పెట్టి ఈ రోడ్డును మరమ్మత్తులు చేశామని చెప్పుకున్న ప్రభుత్వ యంత్రాంగం మళ్లీ యధాస్థితికే వచ్చిందన్నారు. మూడు నెలలు కాకముందే మళ్లీ రోడ్డు గుంతల మయంగా మారి ప్రజలు నడవడానికి ఉపయోగకరంగా లేకుండా తయారైందన్నారు. 40 లక్షల రూపాయలు వృధా అయిపోయినాయి అన్నారు. వెంటనే రోడ్డును బాగుచేయించాలని డిమాండ్ చేశారు.

వీఆర్ఏలకు సంఘీభావం తెలిపిన బీఎస్పీ.

సంగారెడ్డి, జులై 22 (నేటినిజం ప్రతినిధి):రాష్ట్ర వ్యాప్తంగా వీ ఆర్ ఏ లు తమ హక్కుల కోసం అన్ని జిల్లాల వారీగా కలెక్టర్ కార్యాలయల ముందు ధర్నా లు నిర్వహిస్తుండగా. శనివారము నాడు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి లో భాగంగా బహుజన సమాజ్ పార్టీ నాయకులు మట్టడి కార్యక్రమం లో పాల్గొని వీ ఆర్ ఏ లకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమం లో బీఎస్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి బాలయ్య మాట్లాడుతూ వీ ఆర్ ఏ లు తమ న్యాయ మైన హక్కుల గురించి పోరాడుతున్నారని , వారికి పేస్కెల్ , ప్రమోషన్ లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. వీ ఆర్ ఏ లకు మద్దతుగా బీఎస్పీ పార్టీ మీ వెన్నంటి ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సంగారెడ్డి నియోజకవర్గం అధ్యక్షులు వినోద్ కుమార్, జిల్లా కార్యదర్శి గంగేరి శ్రీధర్, కార్యదర్శి జార్జ్, కొండాపూర్ మండల కన్వీనర్ ప్రేమనందం, సీనియర్ బీఎస్పీ నాయకులు మల్లయ్య , రత్నం తదితరులు పాల్గొన్నారు.

జులై 26 నుండి వరద ప్రాంతాల్లో సీఎం జగన్ పర్యటన

అమరావతి, జులై 23: జులై 26 నుండి వరద ప్రాంతాల్లో సీఎం జగన్ పర్యటించబోతున్నారు. ఈ మేరకు పర్యటనకు సంబదించిన షెడ్యూల్ విడుదలైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు , వరదలకు చాలాప్రాంతాలు ముంపుకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ముంపుకు గురైన ప్రాంతాల్లో సీఎం జగన్ పర్యటించబోతున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటించి వారి కష్టాలను అడిగితెలుసుకున్నారు.

ఇక ఇప్పుడు జగన్ సిద్ధమయ్యారు. వదర ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఇప్పటికే పరిహారం, నిత్యావసరాలను పంపిణీ చేసిన ఏపీ ప్రభుత్వం? వరద పరిస్థితులను పరిశీలిస్తోంది. ఈ క్రమంలో వరద క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 26 నుంచి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు బయలుదేరుతున్నారు.

ఈ నెల 26న వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వెళ్లనున్న జగన్? ఆ మరునాడు కూడా వరద ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు సమాచారం. రాజోలు, పి. గన్నవరం నియోజకవర్గాల్లోని లంక ప్రాంతాల్లో సీఎం పర్యటన సాగుతుందని ప్రాథమిక సమాచారం.

సింగూరు నీటి విడుదలతో అప్రమత్తంగా ఉండాలి...!

-ఏడుపాయలను సందర్శించిన జిల్లా కలెక్టర్ హరీశ్...

సంగారెడ్డి జులై 23(నేటి నిజం ప్రతినిధి)సింగూరు నుంచి ఏడుపాయల మీదుగా మెదక్ జిల్లాకు వచ్చే వరద నీటిని విడుదల చేయడంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని , ఈ విషయంలో పోలీసు శాఖ అవసరమైన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ హరీశ్ సూచించారు. శనివారం పాపన్నపేట మండలంలోని ఏడుపాయలను సందర్శించిన కలెక్టర్ సింగూరు నీటి ప్రవాహాన్ని, వరద ఉధృతిని పరిశీలించారు. ప్రస్తుతం సింగూరు నుంచి నీటిని విడుదల చేసినందన ఏడుపాయలలో నీటి ప్రవాహం ఎక్కడ వరకు వస్తుంది... తదితర విషయాలను ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ... నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతానికి ప్రజలు రాకుండా అవసరమైన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు.

అలాగే మరింత ఎక్కువగా నీరు వచ్చినట్లయితే అత్యవసర పరిస్థితుల్లో పోతంశెట్‌పల్లి వైపు నుంచి ఏడుపాయలకు వచ్చే మార్గాన్ని మూసివేయాలని... పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి నుంచి వచ్చేలా భక్తులకు తెలియజేయాలని కలెక్టర్ హరీశ్ వివరించారు.

మంజీరా పరివాహక ప్రదేశాల్లో ఉన్న రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... పాత ఇళ్ళు, కూలిపోయే స్థితిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను, ఇళ్ళను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున ప్రజలు అవసమైతే తప్ప బయటకు రావద్దని ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.

ప్రజల యోగక్షేమాల కోసం ఎల్లప్పుడూ అధికారయంత్రాంగం పని చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఏడుపాయల వనదుర్గామాతకు రాజగోపురం వద్ద దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో సాయిరామ్, ఏడుపాలయ ఆలయ ఈవో శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, పోలీసులు తదితరులు ఉన్నారు.

భారీ వర్షానికి ములుగు అడవుల్లో చిక్కుకుపోయిన షర్మిల

అమరావతి, జులై 23: మరోసారి తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు, నాలుగు రోజులుగా కాస్త శాంతించిన వరుణుడు.. ఈరోజు ఉదయం నుంచి మళ్లీ తన ప్రతాపాన్ని మొదలుపెట్టాడు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

వాగులు, వంకలు మళ్లీ ఉప్పొంగుతున్నాయి. రహదారులన్నీ మినీ చెరువులుగా దర్శనమిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తుతోంది. ఈ క్రమంలో వైస్ షర్మిల ములుగు అడవుల్లో చిక్కుకుంది.

శుక్రవారం (జులై 22) సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ములుగు జిల్లాలో పసర – తాడ్వాయి మధ్య పెద్ద వాగు ప్రధాన రహదారిపై పొంగుతోంది. అప్పుడే అటుగా షర్మిల కాన్వాయ్ వచ్చింది.

ఆ ప్రవాహాన్ని దాటలేక అక్కడే నిలిచిపోయారు. ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరద కారణంగా వైఎస్ షర్మిల వాహన శ్రేణి సుమారు గంట సేపు అడవిలోనే నిలిచిపోయింది. వరద ప్రవాహం తగ్గుముఖం పట్టేలా లేకపోవడంతో.. కాన్వాయ్‌ని వెనక్కి మళ్లించి, తిరిగి పసర వెళ్లిపోయారు.

ఇదిలా ఉంటె సూర్యాపేట జిల్లాలో కూలి పనుల కోసం వెళ్లిన 23 మంది కూలీలు చిక్కుకున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం ముకుందపురం-జి.కొత్తపల్లి మధ్యలో ఉద్ధృతంగా ప్రవహిస్తోన్న పాలేరు వాగులో 23 మంది వ్యవసాయ కూలీలు చిక్కుకున్నారు. ఒడ్డుకు చేరుకోలేక సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

వీరు తీసుకున్న స్వీయ వీడియో వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మరోసారి భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. సీఎస్? సోమేశ్?కుమార్?, నీటి పారుదలశాఖ అధికారులు, ఈఎన్సీలతో సమావేశమయ్యారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, వరద ప్రాంతాలు, ఇతర అంశాలపై సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు.

మిర్చి ధరల ఘాటు..

అమరావతి, జులై 23: మార్కెట్లో మిర్చి ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మిర్చి మార్కెట్ లో మున్నెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ధరలు నమోదవుతున్నాయి. గతేడాది వైరస్ వల్ల దేశ వ్యాప్తం గా పంట దెబ్బతినడంతో దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. దీంతో కొత్త వుత్పత్తుల మార్కెట్ ప్రారంభంలోనే నాణ్యమైన మిర్చి రకాలు క్వింటాలు రూ.18 వేలనుంచి ప్రారంభం అయ్యాయి. అప్పటి నుంచి ధరల పెరుగుదల కొనసాగుతూనే వుంది. ప్రస్తుతం విదేశాల నుంచి భారీగా కొనుగోలు ఆర్డర్లు రావడంతో నాణ్యమైన మిర్చి రకాలకు విపరీతమైన గిరాకీ వచ్చింది. దీంతో మిర్చి ధరల పెరుగుదల గత కొన్ని రోజులుగా కొనసాగుతోంది. ఆసియా ఖండంలో అతిపెద్ద మిర్చి యార్డుగా గుర్తింపు పొందిన గుంటూరు మిర్చి యార్డులో శుక్రవారం రికార్డు స్థాయిలో కొన్ని రకాల మిర్చి ధరలు పెరిగాయి. 2043 బాడిగ రకం మిర్చి క్వింటాలు రూ.33 వేలు పలికింది. గత ఇంత ధర ఎప్పుడూ లభించలేదని వ్యాపార వర్గా లు తెలిపాయి. వేసవి సెలవులకు ముందు రూ.18 వేలులోపు పలికిన వివిధ రకాల మిర్చి ధరలు సీజన్ ముగిసిన తరువాత భారీగా పెరిగాయి. రికార్డు స్థాయిలో గరిష్టంగా క్వింటాలు రూ. 29 వేల నుంచి రూ.33 వేల వరకు పలుకుతున్నాయి. అయితే, ధరల పెరుగుదల వల్ల వ్యాపారు లకు, తప్ప రైతులకు కలిగే ప్రయోజనం స్వల్పంగా ఉంది. చైనా, వియత్నాం, బంగ్లా దేశ్, స్పేయిన్ తదితర దేశాల నుంచి మిర్చికి ఆర్డర్లు వచ్చినట్లు- వ్యాపారులు చెబుతున్నా రు. దీంతో ధరలు మరింతగా పెరిగాయి. ఇప్పటి వరకు మిర్చిని నిల్వ చేసిన వ్యాపారు లకు బాగా కలసి వచ్చింది. వేసవి సెలవులకు ముందు వచ్చిన ధరల కన్నా ఇప్పుడు క్వింటాలుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అధిక ధరలు లభిస్తున్నాయి. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన వ్యాపారులు, కొంత మంది రైతులకు ఇప్పుడు బాగా లబ్ధిపొందు తున్నారు. గుంటూరు జిల్లాల్లోని కోల్డ్ స్టోరేజిల్లో ప్రస్తుతం 40 లక్షల వరకు మిర్చి టిక్కిలు నిల్వ ఉన్నాయి. ఇందులో 30 లక్షల టిక్కిలు వ్యాపారులకు, మిగిలినవి రైతులకు సంబంధించినవని సమాచారం.

రైతులకు వివిధ రూపాల్లో పెట్టుబడి పెట్టే వ్యాపారులు ముందస్తు అవగాహన కుదుర్చుకుని రైతుల పేరున కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయడం జరుగుతుంది. నాన్ ఎసి కామన్ వెరయిటీ సగటు ధర క్వింటాలు గరిష్టంగా రూ. 25,500 వేలు పలికింది. నాన్ ఎసి స్పెషల్ వెరయిటీ సగటు ధర రూ.26 వేలు వచ్చింది. ఎసి కామన్ వెరయిటీ గరిష్ట ధర రూ.25,500 పలికింది. ఎసి స్పెషల్ వెరయిటీకి క్వింటాలుకు రూ.25 వేలు ధర వచ్చింది. మిర్చిలో అత్యధిక డిమాండ్ ఉన్న తేజ, బాడిగ రకాలు రాష్ట్రం లో పండిన వాటికి మాత్రం క్వింటాలు రూ.30 వేల నుంచి రూ.33వేల వరకు పలికి నట్టు వ్యాపారులు చెబుతున్నారు. 355 బాడిగ రకం మిర్చి గరిష్టంగా రూ.29,500 వేలు పలకగా, 341 బెస్టు రకం క్వింటాలు రూ.29,000కు కొనుగోలు చేశారు. 2043 బాడిగ రకం మిర్చికి రూ.33 వేలు, సీజెంటా బేడిగ రకం మిర్చికి రూ.29 వేలు వరకు ధర లభించింది. నెంబరు 5 డీలక్స్ రకానికి రూ.27,500, దేవనారు డీలక్స్ రకం రూ.28,500 ధర వచ్చింది. తామర తెగులు తట్టుకుని నిలదొక్కుకున్న మిర్చి వెరయిటీలు గత రెండు నెలల క్రితమే యార్డుకు వచ్చాయి. రైతుల వద్ద గరిష్టంగా క్వింటాలు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఇప్పుడు రూ.25 వేల నుంచి రూ.30 వేలకు పైగా విక్రయించుకుంటున్నారు. గుంటూరు మార్కెట్లో రి-టైల్ ధర కిలో రూ.275 నుంచి రూ.350 వరకు పలుకుతోంది. మిర్చి ధరల పెరుగుదల రైతులు, వ్యాపారులకు లాభాల పంట పండిస్తుండగా .. సామాన్యులకు మాత్రం మంట మండిస్తోంది.

ఆర్యవైశ్యులను ఒక తాటిపైకి తెచ్చే ఐవీఎఫ్.. యువ నాయకులు

(నేటినిజం ప్రతినిధి): ప్రపంచంలోని ఆర్య వైశ్యులను ఒక్క తాటిపైకి తేవాలనే ఉద్దేశంతో ఐవీఎఫ్ ముందుకు సాగుతుందని తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి రాజేందర్ పేర్కొన్నారు. ఐవీఎఫ్ 9వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఉత్తర్ ప్రదేశ్‌లోని మధురలో గల వ్రిందావణంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా పాల్గొన్న రాజేందర్ మాట్లాడుతూ? 9 సంవత్సరాల క్రితం స్వర్గీయ రాందాస్ అగర్వాల్ స్థాపించిన ఐవీఎఫ్ అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు.

ఐవీఎఫ్ స్థాపించిన 9 ఏళ్లుగా కరీంనగర్ జిల్లాలోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, వేల మందికి ఆపదలో రక్తదానం చేశామన్నారు. కరోనా సమయంలో లక్షల మందికి యువజన విభాగం ఆధ్వర్యంలో ఉచితంగా భోజనాలు అందించామన్నారు. ఇకముందు కూడా అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం శాఖ అభివృద్ధి ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, బచ్చు శ్రీనివాస్, కూర నాగరాజు, రఘు గంగిషెట్టి, జిన్నం వేణు, ఐవీఎఫ్ నాయకులు హాజరయ్యారు. అలాగే రాజేందర్‌తోపాటు కరీంనగర్ జిల్లా యువజన అధ్యక్షుడు సంతోష్ కుమార్, జనగాం జిల్లా అధ్యక్షుడు బిజ్జల నవీన్, కరీంనగర్ జిల్లా యువజన నాయకుడు తోడుపునురి హరిప్రసాద్, హైదరాబాద్ యువజన నాయకుడు కొలుపురి నరేష్‌లతో పాటు పాల్గొన్నారు.

13 మంది పేకాటరాయుళ్ల పట్టివేత- రూ.80,700 స్వాధీనం

కరీంనగర్ , జులై 23: కరీంనగర్ లోని రెండు వేరువేరు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 13 మందిని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. వీరి వద్ద నుండి 80,700 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో పేకాట ఆడుతున్న 8మంది సిహెచ్ హనుమంతు, కుంచాల చిరంజీవి, గోనెపల్లి శ్రీను, నలిమెల అజయ్, బండారి వెంకటేష్, బండారి సుబ్బయ్య, వెలుగు నాగరాజు, బత్తిని శ్రీను లను పట్టుకున్నారు వీరి వద్ద నుండి 62,000 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. కోతిరాంపూర్ లో పేకాట ఆడుతున్న 5గురిని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారు. పోరండ్లకు చెందిన కిన్నెల సతీష్, బోయిని బాపురాజు, హరిపురం కు చెందిన గోగు శ్రీనివాస్, సుభాష్ నగర్ కు చెందిన పెల్లి సంతోష్, దేవంపల్లికి చెందిన పోలు శ్రీధర్ లు పట్టుబడ్డారు. వీరి వద్దనుండి 18,700రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు.

ఔటర్‌పై పట్టపగలే జిగేల్‌మంటున్న ఎల్ఈడీ లైట్లు

హైదరాబాద్, జులై 23: ఔటర్ రింగ్ రోడ్ మొత్తం జిగేల్ మనిపించే ఎల్ఈడీ లైట్ల వెలుతురులో మెరిసిపోతోంది. గతంలో ప్రయోగాత్మకంగా 26 కి.మీ మేర రోడ్డుకు ఇరువైపుల ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయగా.. ఇప్పుడు ఓఆర్ఆర్ వ్యాప్తంగా లైటింగ్ పనులను కంప్లీట్ చేసినట్టు తెలుస్తోంది. దీనివల్ల రాత్రివేళల్లో యాక్సిడెంట్లు జరగకుండా వాహనాలు జాగ్రత్తగా వెళ్లే చాన్స్ ఉంటుంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. పగలు కూడా లైట్లను ఆపేయకుండా అట్లానే ఉంచుతున్నారు. దీంతో హెచ్?ఎండీఏకూ విపరీతమైన కరెంట్ బిల్లులు వస్తున్నట్టు తెలుస్తోంది.

సాయంత్రం నుంచి తెల్లవారు జాము వరకు లైటింగ్ ఉంటే పర్వాలేదు కానీ, డే టైమ్‌లో కూడా లైట్లు వెలగడం వల్ల ఎవరికి ఉపయోగం అని చాలామంది వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై పెదవి విరుస్తున్నారు. పెద్ద మొత్తంలో వచ్చే కరెంటు బిల్లులను వారి ఇంట్లో నుంచి చెల్లించడం లేదు కదా.. అందుకే అట్లా వదిలేస్తున్నారేమో అనే కామెంట్స్ కూడా చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు ఫోకస్ పెట్టాలి. నైట్ టైమ్‌లో మాత్రమే ఎల్?ఈడీ లైట్లు వెలిగేలా చూడాలని చాలామంది కోరుతున్నారు.

డే లైట్‌కి అడ్జస్ట్ అయ్యేలా చేయాలి..

ఇక.. గతంలో కరెంట్ చార్జీల భారం లేకుండా సోలార్‌పై హెచ్ఎండీఏ అధ్యయనం చేసినా.. నిర్మాణ వ్యయం పెరుగుతుందని కేవలం ఎల్ఈడీ లైట్లతో ఈ ప్రాజెక్టుకు హెచ్ఎండీఏ ఒకే చెప్పింది. సోలార్ అప్ గ్రేడేషన్?కు వీలుండేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. రోడ్లపై వెహికల్స్ రద్దీకి అనుగుణంగా లైటింగ్ ఆటోమేటిగ్‌గా అడ్జస్ట్ అయ్యేలా సిస్టమ్?ని రూపొందిస్తామన్న అధికారులు దానిపై ఫోకస్ పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు. డే టైమ్ లైట్?కి తగ్గట్టు పవర్ సప్లయ్ నిలిచిపోయేలా చేస్తే లక్షలాది రూపాయల కరెంటు బిల్లులు హెచ్ఎండీఏకి ఆదా అవుతాయని చెబుతున్నారు.

చురుకుగా కదులుతున్న నైరుతి రుతుపవనాలు.. మరో రెండు రోజులు విస్తారంగా వర్షాలు

అమరావతి, జులై 23: బంగాళాఖాతం నుంచి కోస్తాపైకి తేమగాలులు వీస్తుండటంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. దీంతో శుక్రవారం కోస్తాలో అనేకచోట్ల ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో ఎక్కు వచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలో అక్కడక్కడా భారీవర్షా లు పడతాయని, ఆ తరువాత రెండు, మూడు రోజులు కూడా అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తా, రాయలసీమలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఏడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి.

రుతుపవన ద్రోణి ఇప్పుడు గంగానగర్, రోహ్తక్, గ్వాలియర్, సిధి, అంబికాపూర్, సంబల్పూర్, బాలాసోర్ మరియు ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళా ఖాతం వరకు ప్రయాణిస్తున్నది. ఇది సగటు సముద్ర మట్టము పై 0.9 కి.మీ వరకు విస్తరించి ఉంది. ఇది సగటు సముద్ర మట్టం పై 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి , ఎత్తు కు వెళ్లే కొద్దీ నైరుతి దిశగా వంగి ఉన్నది. దీని ఫలితంగా మరో రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవ కాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సాంకేతికత విద్య

అమరావతి, జులై 23: తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన విద్యను అందించేందుకు వీలుగా ఏర్పాటు చేయనున్న డిజిటల్ డిస్‌ప్లేలకు సంబంధించి వివిధ కంపెనీల విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ సమీర్ శర్మ, పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, పాఠశాల విద్యాశాఖ సలహాదారు ఎ మురళీ, ఏపీ స్కూల్ ఎఫ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ కార్యదర్శి ఏ సాంబశివారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

మామిడి కాయ కావాలని అడిగిన బాలిక- హత్య చేసిన మేనమామ

లక్నో. జులై 23: మామిడి కాయ కావాలని పదే పదే అడిగినందుకు ఒక బాలికను మేనమామ హత్య చేశాడు. ఉత్తర ప్రదేశ్‌లోని షామ్లి జిల్లాలో ఈ దారుణం జరిగింది. ఖేదా కుర్తాన్ గ్రామానికి చెందిన కూలీ కుమార్తె 5 ఏళ్ల ఖైరు నిషా, మంగళవారం మేనమామ ఉమరుద్దీన్ ఇంటికి వెళ్లింది. భోజనం చేస్తున్న అతడ్ని మామిడి కాయ కావాలని పదే పదే అడిగింది. దాని కోసం మేనకోడలు మారాం చేసి విసిగించడంపై మేనమామ ఆగ్రహం చెందాడు. ఆ చిన్నారి తలపై ఇనుప రాడ్‌తో కొట్టాడు. అనంతరం కత్తితో బాలిక గొంతు కోసి హత్య చేశాడు. మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి ఇంట్లో దాచాడు.

మరోవైపు బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆమె కోసం వెతికారు. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తనపై అనుమానం రాకుండా ఉండేందుకు ఉమరుద్దీన్ కూడా వారితో కలిసి వెతికేందుకు వెళ్లాడు. పోలీసులు అతడిపై అనుమానం వ్యక్తం చేయడంతో పారిపోయాడు.

కాగా, ఉమరుద్దీన్ ఇంట్లో సోదా చేసిన పోలీసులు గోనె సంచిలో ఉన్న బాలిక మృతదేహాన్ని కనుగొన్నారు. అనంతరం పారిపోయిన నిందితుడి కోసం గాలించారు. సమీప అటవీ ప్రాంతంలో ఉన్న ఉమరుద్దీన్‌ను గురువారం అరెస్ట్ చేశారు. బాలిక హత్యకు వినియోగించిన కత్తి, ఐరన్ రాడ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ రిక్రూట్‌మెంట్ స్కాం ప్రకంపనలు : మంత్రి మరో సన్నిహితురాలిపై ఈడీ నిఘా

కోల్‌కతా, జులై 23: పశ్చిమ బెంగాల్‌లో టీచర్ రిక్రూట్‌మెంట్ స్కాం ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఈ కుంభకోణంలో బెంగాల్ మంత్రి పార్థా ఛటర్జీని అరెస్ట్ చేయగా, ఆయన సన్నిహితురాలు అర్పితా ముఖర్జీని నిర్బంధించారు. ఇదే కేసులో కజి నజ్రుల్ యూనివర్సిటీకి చెందిన బంగ్లా ప్రొఫెసర్, మంత్రి మరో సన్నిహితురాలు మొనాలిసా దాస్ పాత్రపైనా ఈడీ ఆరా తీస్తోందని సమాచారం. మొనాలిసా పేరున 10 ఫ్లాట్లు ఉన్నాయని, ఆమె కూడా ఈడీ నిఘా నేత్రంలో ఉన్నదని బీజేపీ నేత దిలీప్ ఘోష్ పేర్కొన్నారు.

ఈమె కూడా బంగ్లాదేశీయేనని చెప్పారు. ఇక అంతకుముందు పశ్చిమబెంగాల్ పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి సన్నిహితురాలి ఇంట్లో భారీ మొత్తంలో డబ్బు పట్టుబడింది. మంత్రి పార్థా ఛటర్జి సన్నిహితురాలు అర్పితా ముఖర్జీ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాడిచేశారు. సోదాల్లో ముఖర్జీ ఇంట్లో రూ.20 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రూ.500, రూ.2000 నోట్ల కట్టలను గుట్టలుగా పోశారు. ఇదంతా రాష్ట్రంలో టీచర్ రిక్రూట్‌మెంట్ కుంభకోణానికి సంబంధించినదిగా భావిస్తున్నారు. వీటితోపాటు 20 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాణిజ్య శాఖ మంత్రి పార్థా ఛటర్జీతోపాటు, విద్యాశాఖ మంత్రి ప్రవేశ్ అధికారి, ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రాథమిక విద్యామండలి మాజీ అధ్యక్షుడు మాణిక్ భట్టాచార్య, మరికొందరి నివాసాలపైనా ఈడీ ఏక కాలంలో దాడులు నిర్వహించింది. పార్థా ఛటర్జీ విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన వద్ద ఓఎస్‌డీగా పనిచేసిన పీకే. బందోపాధ్యాయ్, వ్యక్తిగత కార్యదర్శి సుకాంతా ఆచార్జీ తదితరుల ఇళ్లలోనూ సోదాలు జరిగాయి.

వరల్డ్ అథ్లెటిక్స్ జావెలిన్ త్రోలో ఏడో స్థానంలో మన అన్నూ రాణి

యూజీన్ (అమెరికా) : ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్-2022 జావెలిన్ త్రో (మహిళల విభాగం) లో భారత ఆశాకిరణం అన్నూరాణి ఫైనల్స్‌లో ఆశించిన మేర రాణించలేకపోయింది. ఫైనల్స్‌లో ఆమె ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. ఐదు ప్రయత్నాల్లో భాగంగా అన్నూ రాణి.. 61.12 మీటర్ల దూరం మాత్రమే విసరగలిగింది. ఈ పోటీల్లో అమెరికాకు స్వర్ణం, రజతం లభించగా.. జపాన్ అమ్మాయికి కాంస్యం అందింది.

యూఎస్‌లోని యుజీన్ వేదికగా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్-2022 జరుగుతున్నాయి. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం జరిగిన జావెలిన్ త్రో మహిళల ఫైనల్స్‌లో అన్నూరాణి ఐదు ప్రయత్నాల్లో ఒక్కసారే 60 మీటర్ల కంటే ఎక్కువ దూరం బరిసెను విసిరింది. తొలిసారి 56.18 మీటర్లు విసిరిన రాణి.. ఆ తర్వాత వరుసగా 61.12 మీటర్లు, 58.14, 59.98, 58.70 మీటర్లు విసిరింది. ఈ సీజన్‌లో ఆమె బెస్ట్ 63.82 మీటర్ల దూరం నమోదైనా రాణికి కనీసం కాంస్యమైనా దక్కేది.

ఫైనల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్, ఆస్ట్రేలియాకు చెందిన కెల్సీ లీ బార్బర్ 66.91 మీటర్ల దూరం విసిరి స్వర్ణం నెగ్గింది. అమెరికా త్రోయర్ కారా వింగర్ 64.05 మీటర్లతో రజతం గెలవగా.. జపాన్ అమ్మాయి హరుకా కిటగుచి 63.27 (రాణి నేషనల్ బెస్ట్ కంటే తక్కువే) మీటర్ల దూరం విసిరి కాంస్యం నెగ్గింది. అన్నూ రాణి పోరాటం ముగియడంతో ఇప్పుడు యావత్ భారతావని కళ్లన్నీ టోక్యో ఒలింపిక్స్ గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా మీదే ఉన్నాయి. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం చోప్రా ఫైనల్స్ జరుగుతాయి.

400 మీటర్ల హార్డిల్స్.. చరిత్ర సృష్టించిన సిడ్నీ మెక్‌లాగిన్



యూజీన్: సిడ్నీ మెక్‌లాగిన్ చరిత్ర సృష్టించింది. తన రికార్డును మళ్లీ తానే బద్దలు కొట్టింది.

అమెరికాలోని ఓరేగాన్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆ దేశ అథ్లెట్ సిడ్నీ మెక్‌లాగిన్ 400 మీటర్ల హార్డిల్స్‌లో కొత్త రికార్డు నెలకొల్పింది. 22 ఏళ్ల సిడ్నీ కేవలం 50.68 సెకన్లలో 400 మీటర్ల హార్డిల్స్‌ను పూర్తి చేసి గోల్డ్ మెడల్ గెలుచుకున్నది. జూన్‌లో క్రియేట్ చేసిన 51.41 సెకన్ల రికార్డును ఆమె మళ్లీ బ్రేక్ చేసింది. ఇది నమ్మలేకపోతున్నానని, మరింత వేగంగా మారిపోతున్నానని ఆమె అన్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన ఫెమ్కా బోల్ బ్రాంజ్ మెడల్ గెలువగా, అమెరికాకే చెందిన దలీలా మొహమ్మద్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

గల్లంతైన యాకయ్యను బయటకు తీయాలి : మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్, జులై 23 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని కంటయ పాలెం గ్రామంలో పశువుల కాపరి పల్లె యాకయ్య గౌడ్ పెద్ద చెరువు మత్తడి వరదలో గేదెతో కలిసి కొట్టుకుపోయాడు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులను ఓదార్చారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి గల్లంతయిన యాకయ్య ను బయటికి తీయాలని సూచించారు.

ఏపీలో బోర్లకు విద్యుత్ మీటర్లు.. మంత్రి కాకాణి కొత్త భాష్యం

నెల్లూరు, జులై 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బోరుబావులకు విద్యుత్ మీటర్లు బిగింపుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొత్త భాష్యం చెప్పారు. లోడ్ అంచనా వేసేందుకే బోర్లకు మీటర్లు బిగిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రభుత్వం జవాబుదారీతనం కోసం ఈ మీటర్లు బిగిస్తున్నదని కూడా చెప్పడం విశేషం. వ్యవసాయ కనెక్షన్లు తొలగించమని, ఈ బోర్ మీటర్లకు వచ్చే బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి కాకాణి ఈ వ్యాఖ్యలు చేశారు.

వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు మీటర్ల బిగింపుపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను మంత్రి కాకాణి తోసిపుచ్చారు. ప్రభుత్వం జవాబుదారీతనం కోసమే ఈ మీటర్లు బిగించి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం భవిష్యత్‌లో ఆదుకోవడానికి లోడ్ అంచనా వేస్తున్నదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించడానికి ఎంత లోడ్ అవసరమో, ఎంత మంది రైతులు 9 గంటల ఉచిత పగటిపూట విద్యుత్ సరఫరా పొందుతున్నారో ప్రభుత్వం అంచనా వేసేందుకే ఈ మీటర్ల ఏర్పాటు అని స్పష్టం చేశారు.

వ్యవసాయ కనెక్షన్లు డిస్‌కనెక్ట్ చేయబోమని స్పష్టం చేశారు. ఈ మీటర్లకు బిల్లులు రాగానే ఆ మొత్తాన్ని డిస్కమ్‌లకు ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. అయితే, రైతుల్లో గందరగోళం సృష్టించడం ద్వారా టీడీపీ నేతలు ఈ రొటీన్ అసెస్‌మెంట్ విధానాలను క్లిష్టతరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం చెల్లించకుండా మిగిలిపోయిన రూ.9,000 కోట్ల విద్యుత్ బకాయిలను తమ ప్రభుత్వం క్లియర్ చేసిందని ఈ సందర్భంగా కాకాణి గుర్తుచేశారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను వైసీపీ సర్కార్ అందించడం ప్రారంభించిందని, అదనంగా రూ.1,700 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతులు పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్‌ను అందుకుంటున్నారని, అయినప్పటికీ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూనే ఉన్నాయని కాకాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లా పరిధిలో ఉన్న రౌడీ షీటర్లలపై ప్రత్యేక నిఘా

-ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు-జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, జులై 23 (నేటినిజం ప్రతినిధి): రౌడీ షీట్స్ ఉన్న వారిపై నిరంతరం పోలీస్ నిఘా, పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామనిజిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. శనివారం జిల్లాలో ఉన్న రౌడీ షీట్లర్ల పై జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ,సబ్ డివిషన్ స్థాయి అధికారులతో కలసి సమీక్ష సమావేశంనిర్వహించరూ. ఈ సందర్భంగా ఆయా సబ్ డివిషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న రౌడి షీటర్ల జాబితా మరియు వారియొక్క కదలికల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్లు కొన్ని రోజులుగా నేరాలకు దూరంగా ఉండటంతో పాటు సత్ప్రవర్తనతో మెదులుతున్న వారిని గుర్తించి వారిజాబితాను తయారు చేయాలని వారిపై ఉన్న రౌడి షీట్స్ నుతొలగించడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుంది అనిఅన్నారు.పాత నేరస్తులు సత్ప్రవర్తనతో జీవితాలను సరిదిద్దుకోవాలి ఈ సందర్భంగా తెలిపారు .రౌడీషీటర్ల ప్రవర్తనలో ఎటువంటి మార్పులు లేకుండా తరచు నేరాలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై పీడీ యాక్ట్ లు నమోదు చేయాడాం జరిగుతుంది అని అన్నారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లుచంద్రశేఖర్,నాగేంద్రచారి పాల్గొన్నారు..

ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికల దాన్నే సువర్ణ పాలన కొనసాగుతోంది

-అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ .నరేందర్ రెడ్డి

కరీంనగర్ , జులై 23: (నేటినిజం ప్రతినిధి): ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికలు కీలకంగా వ్యవహరిస్తాయని మరియు

ఎన్నికల ద్వారానే సమర్థ పాలన కొనసాగుతుందని మరియు ప్రజలకు కావల్సిన అభివృద్ధి ఫలాలను అత్యధికంగాఅందజేయవచ్చని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి . నరేందర్ రెడ్డి అన్నారు . కరీంనగర్ వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్స్ ప్రాంగణంలో ఎన్నికల ప్రోటోకాల్ల పాటిస్తూ ఏర్పాటు చేసినటువంటి " హౌజ్ ఎలక్షన్స్ " ప్రక్రియ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్య దేశంలో పెద్దన్న పాత్ర పోశిస్తుందని మరియు ప్రజల మనోభావాలకు ధర్పణం అని చెప్పారు . ఎన్నికల ద్వారానే ప్రజలు వారికి కావల్సిన అవసరాలను తీర్చుకోగల్గుతారని మరియు ఉత్తమమైన వ్యక్తిని ఎన్నుకోడానికి మరియు బలపర్చడానికి ఒక అత్యుత్తమ వేదిక అని చెప్పారు . ప్రజాస్వామ్య దేశంలో ఓట్లు చాలా కీలకంగా వ్యవహరిస్తాయని మరియు నాయకుల భవితవ్యాన్ని తేల్చి చెప్పేది ఎన్నికే అని చెప్పారు . విద్యార్థులకు ప్రాథమిక దశనుండే ఎన్నికల పట్ల అవగాహన కల్పించడానికై మరియు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికై ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఈ సంవత్సరం సైతం రెట్టింపు ఉత్సాహంతో పాఠశాలలోని వివిధ విభాగాల కెప్టెన్స్ మరియు వైస్ కెప్టెన్లకు ఎన్నికలు , ఎన్నికల వాతావరణం కల్పించే విధంగా నిర్వహించడం కొనసాగినదని చెప్పారు . పాఠశాలలోని " తేజస్ " , " సరస్ " , " ధృవ " మరియు " లక్ష్య " విభాగాలకు బాలబాలికలకు వేరు వేరుగా ఎన్నికల పోటీలను నిర్వహించడం జరిగినదని తెలుపుతూ విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడానికై మరియు శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికై ప్రత్యేకంగా సామాజిక స్పృహను కల్పించడానికై ఎన్నికలను అట్టహాసంగా కరోనా ప్రోటోకాలు పాటిస్తూ నిర్వహించడం జరిగినదని చెప్పారు . ప్రారంభానికి ముందు డా ॥ వి . నరేందర్ రెడ్డి గారు విద్యార్థులకు ఎన్నికల విశిష్టత మరియు ఓటు హక్కు నిర్వర్తించే తీరు స్పష్టంగా తెలియజేశారు . పాఠశాలలోని " తేజస్ " , " సరస్ " , " ధృవ " మరియు " లక్ష్య " విద్యార్థులు నాయకత్వ లక్షణాలను బలపర్చడానికై ప్రత్యేక నాటికను రూపొందించి ప్రదర్శించి సభికులను ఆహుతులను చేశారు . ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది ఔత్సాహికులు వారి ఉత్సాహాన్ని ప్రదర్శించి పోటీలో పాల్గని కేటాయించిన గుర్తులను ప్రచారం చేసుకొని ఓట్లను అభ్యర్థించారు . ప్రత్యేకంగా వారు ప్రదర్శించిన " ఓటు - విలువైన హక్కు " , " ఓటు వేయకపోతే కోల్పోతాం - మన హక్కు " నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

బఫర్ జోన్‌లో పేద ప్రజలకు అన్యాయం జరిగితే సహించం

-కాంగ్రెస్ నాయకుడు ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జులై 23 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మూలవాగు బఫర్ జోన్ లో పేద ప్రజలకు

అన్యాయం జరిగితే సహించేదిలేదని కాంగ్రెస్ నాయకుడు ఆది శ్రీనివాస్ అన్నారు.

శనివారం అది శ్రీనివాస్ నివాసం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బఫర్ జోన్ పేరిట పేద ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. మొదటి బైపాస్ రోడ్ లో నిర్మాణాలను కూల్చేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టడం స్వాగతిస్తున్నామని అన్నారు.

ఇదే సమయంలో మూల వాగును ఆనుకొని వున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు ఇంటిని ఎందుకు టచ్ చేయలేదో కలెక్టర్, ఏఈ లు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు ప్రజలకు సమాధానం ఇవ్వాలని కోరారు.

చట్టంలో అందరికీ సమానంగా పనిచేయాలని సూచించారు. మూలవాగు బఫర్ జోన్ ఎంత వరకు వుందో సర్వే నిర్వహించి ప్రజలకు తెలపాలన్నారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, సంగ స్వామి యాదవ్, రంగు వెంకటేష్ గౌడ్, పాత సత్యలక్ష్మి , చిలుక రమేష్, కనికరపు రాకేష్, పుదుతల రాము తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణి శ్రీ సుబ్రమణ్యస్వామికి వెంకన్నస్వామి తరపున పట్టువస్త్రాలు అందజేసిన వైవీ సుబ్బారెడ్డి

న్యూఢిల్లీ, జులై 23: తమిళనాడులోని తిరుత్తణి శ్రీ సుబ్రమణ్యస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి తరపున టీటీడీ పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీసమేతంగా హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. కరోనా నుంచి దేశం విముక్తి పొంది ప్రజలంతా సుభిక్షంగా ఉండేలా ఆశీర్వదించాలని శ్రీ సుబ్రమణ్య స్వామిని ప్రార్థించినట్లు ఆ తర్వాత సుబ్బారెడ్డి తెలిపారు. ఆదికృత్తిక కావడి మహోత్సవ వేడుక సందర్భంగా తనపల్లిలోని శ్రీ పద్మగిరి బాల జ్ఞాన దండాయుధపాణి స్వామి వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమంలో ఆయన పాలుపంచుకున్నారు.

సిరాజ్‌పై ఆ నమ్మకం ఉంచాం.. తొలి వన్డే విజయంపై చాహల్

వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు ఉత్కంఠభరిత విజయం సాధించింది. 308 పరుగుల టార్గెట్ సెట్ చేసినా కూడా కేవలం మూడు పరుగుల తేడాతోనే విజయం సాధించగలిగింది. లక్ష్య ఛేదనలో కైల్ మేయర్స్, బ్రాండన్ కింగ్ చేసిన అద్భుతమైన హాఫ్ సెంచరీలు వృధా అయ్యాయి. ఈ మ్యాచ్‌లో చివరి ఓవర్లో 15 పరుగులు కావలసి ఉండగా.. యువ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు ఆ ఓవర్ ఇచ్చారు.

దీనిపై చాహల్ మాట్లాడుతూ.. 15 పరుగులను సిరాజ్ కాపాడగలడనే నమ్మకం తమకుందన్నాడు. అంతకుముందు ఓవర్లలో కూడా తను మంచి యార్కర్లు వేశాడని. ఆ తర్వాత వైడ్ బంతికి పరుగులు రాకుండా సంజూ శాంసన్ ఆపడంతో తమ కాన్ఫిడెన్స్ మరింత పెరిగిందని చెప్పాడు. విండీస్ బ్యాటర్లు అద్భుతంగా ఆడుతుండటంతో కొంత ఒత్తిడికి లోనయ్యామని, కానీ సిరాజ్‌పై నమ్మకముంచామని వివరించాడు. సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చెయ్యడంతో మూడు పరుగుల తేడాతో భారత జట్టు మ్యాచ్ గెలిచింది.

పోచమ్మకు బోనమెత్తిన శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు

-ఆకట్టుకున్న వేషాధరణ

రాజన్న సిరిసిల్ల, జులై 23 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణములోని శ్రీ చైతన్యటెక్నో స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలురు పోతరాజుల వేషాలు వేయగా, బాలికలు సంప్రదాయవస్త్రాలంకరణలతోనెత్తిపై బోనంతో దప్పుచప్పుళ్ల మధ్య ఉరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుదేశ్ కుమారి మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలపై చిన్నపటి నుండేఒక.అవగాహన కలిగేలా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. వర్షాలు సంవృద్ధిగా పడి, పాడి పంటలు బాగా పండి, ప్రజలందరూ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో హై స్కూల్ డీన్ ప్రేమరీ, ఇంచార్జ్ శ్రావణి, పిపిటి ఇంచార్జ్ మమక,సుదీర్, శశాంక్, సునకపాల్గొన్నారు.

బాలల కవితా సంకలనానికి
కవితలకు ఆహ్వానం
విశ్వసాహితీ మరియు అఖిలభారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సంయుక్తంగా
75 సంవత్సరాల స్వాతంత్ర్య అమృతోత్సవం
పండుగ సందర్భంగా ప్రచురించదలచిన
బాలల కవితా సంకలనానికి
10-15 సం॥ వయసు బాల బాలికలనుండి
కవితలకు ఆహ్వానం
★ కవిత 10-15 లైన్లకు మించరాదు
★ పేరు, క్లాస్, ఫోన్ నంబర్ మొదలైన వివరాలు
★ 9618895543 వాట్సాప్ నంబరుకు పంపవలెను.
ఆఖరు తేది: 25-7-2022
ఆగష్టు రెండవ వారంలో ఈ కవితా సంకలనం ఆవిష్కరణ జరుగుతుంది
బాల కవులకు సర్టిఫికెట్, కవితల పుస్తకం ప్రదానం చేయడం జరుగుతుంది.
అధ్యక్షులు-కార్యవర్గ సభ్యులు
విశ్వసాహితి మరియు ఎ.బి.బి.యస్.యస్.
సాహితీ సాంస్కృతిక సంస్థలు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.